తిరుపతి - చిత్తూరు



తెలుగు జాతీయ దినపత్రిక
వార్త



## లారీని ఢీకొట్టిన కారు..

### ఇద్దరు పిల్లలు మృతి - మరో నలుగురికి తీవ్రగాయాలు



చంద్రగిరి, జనవరి 19 ప్రభాతవార్త: మండలంలోని పనపాకం పంచాయతీ, జక్కలవారిపల్లి వద్ద పూతలపట్టు- నాయుడు పేట జాతీయ రహదారిలో పాతరోడ్డుపై ఆదవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు పిల్లలు మృతి చెందగా నలుగురు గాయ పడ్డారు. తమిళనాడు, కోయంబత్తూరు నుండి తిరుమలకు వస్తున్న కారు చిత్తూరు వైపు వెళు తున్న లారీని నేరుగా ఢీకొట్టడంతో కారు లారీ క్రిందకు దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో ఇద్దరు చిన్నారులు జీవన్ (10), విశ్వ (06) అక్కడికక్కడే మృతి చెందారు. కార్తికేయన్ (50), సతీష్ (35), కలైవేణి (45), ఐశ్వర్య (30) తీవ్రంగా గాయపడ్డారు. సిఐ సుబ్బరామిరెడ్డి సం ఘటనా స్థలికి చేరుకుని క్షతగాత్రులను తిరుపతి రుయాకు తరలించారు. చిన్నారుల మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు.

## గోవిందుని ఆలయంపై పొగమంచు

### -ఆహ్లాదంతో భక్తులు పరవశం



తిరుమల, జనవరి 19 ప్రభాతవార్తప్రతినిధి: ఏడుకొండలపై మారిన వాతావరణం, చిరుజల్లులు కురవటంతో ఆదివారం ఉదయం పూర్తిగా ఆలయం పరిసరాలు పొగమంచుతో కమ్మేసింది. ఆలయం పూర్తిగా పొగమంచులో అద్భుతంగా కనువిందుచేసింది. భక్తులు కూడా పుష్పాలంకరణల నడుమ పొంగమంచును ఆస్వాదించారు.

### తొక్కిసలాట ఘటనపై

# సిద్ధమవుతున్న నివేదిక!

### ఇంకొందరు పోలీసులపై వేటు తప్పదా!?



ప్రభాతవార్త-తిరుపతి: తిరుమల ఆలయంలో పదిరోజుల వైకుంఠద్వారదర్శనాలు ముగియడం...ఈ దర్శనాలకోసం ఉచిత టైమ్‌స్లాట్ టోకెన్లు జారీచేసిన ఈనెల 8వతేదీ రాత్రి తిరుపతిలో చోటుచేసుకున్న పరిణామాలపై నివేదికలు సిద్ధమవుతోంది. ముందస్తు ప్రణాళిక లేకుండా ఉన్నపళంగా భక్తులను క్యూలైన్లలో అనుమ తించే విషయంలో ఆయా చోట్ల విధుల్లో ఉన్న కొందరు పోలీసు, టిటిడి అధికారులు నిర్లక్ష్యంతోనే ఈ ఘటన జరిగిందనేది ప్రాథమిక విచారణలోనే తేల్చారు. దీనిపై 9వతేదీ తిరుపతికి చేరుకున్న సిఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్, వైసిపి అధినేత వైఎస్‌జగన్ కూడా తీవ్రస్థాయిలో విచారం వ్యక్తం చేసిన విషయం విదితమే.వేలసంఖ్యలో భక్తులు పలు చోట్ల టోకెన్ జారీచేసే కేంద్రాల వద్ద గుమికూడటం, ఒకటిరెండుచోట్ల కౌంటర్లకు దూరంగా ఖాళీస్థలలాల్లో భక్తులను ఉంచడం జరిగింది. వీరందరినీ నియంత్రించి వరుసక్రమంలో పంపే విషయంలో పోలీసులు, టిటిడి సిబ్బంది అజాగ్రత్తగా వ్యవహరించడమే ప్రధాన కారణంగా తేల్చారు. దర్శన టోకెన్ల కొసం వచ్చి ఒకేసారి ఆరుగురు భక్తులు ప్రాణాలు కోల్పవడం సంచలనం కలిగించింది. 50మందివరకు క్షతగాత్రులవడం జరిగింది. బాధితులం దరికీ టిటిడి నగదు పరిహారం చెల్లించినా ,పదిరోజుల వైకుంఠద్వార దర్శనాలు ముగియడంతో టిటిడి చరిత్రలో ఇదివరకు జరగని అనూహ్య విషాదఘటనలతో దేశం మొత్తం కలతచెందింది. దేశం నలుమూలల నుండి విచ్చేసిన వేలాదిమంది భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో టిటిడి యంత్రాంగం, జిల్లా అధికారగణం విఫలమైందనేది భక్తుల్లో వినిపించిన నిరసనలు. ఈ కారణంగానే సొమ్మసిల్లి భక్తులు క్రిందపడిపోతే తొక్కిసలాట జరిగిందనేది కూడా భక్తుల్లోనే వినిపించిన వాదనలు. ఈ నేపథ్యంలో ఈనెల 8వతేదీ రాత్రి తిరుపతిలోని బైరాగిపట్టెడ రామానాయుడు పాఠశాల ప్రాంగణం, శ్రీనివాసం,విష్ణునివాసం ప్రాంగణాల్లో జరిగిన తప్పిదాలతో భారీ చెడ్డపేరును టిటిడి మూటగట్టుకునే పరిస్థితి వచ్చింది. ఈ ఘటనపై ఉన్నఫళంగా ఒక్కరోజులోనే టిటిడి జేఈఓ గౌతమి. సివిఎస్ఓ శ్రీధర్, తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడును ఆయా స్థానాల నుండి తప్పించారు. తిరుపతి క్రైమ్ డిఎస్పీ రమణకుమార్, టిటిడి గోశాల డైరెక్టర్ డాక్టర్ హరనాథరెడ్డిలపై సస్పెన్షన్ వేటువేశారు. ఇంకా తాజాగా తిరుపతి టౌన్ డిఎస్పీ జె.వెంకటనారాయణ పనితీరు,ఒకింత పర్యవేక్షణ కూడా సరిగా లేకపోవడం ఒకింత కారణమని భావించి ఆయనను పోలీసు హెడ్‌క్వార్టర్స్‌కు బదిలీ చేశారు. ఇప్పుడు ఈ మూడుచోట్ల బందోబస్తు విధులు నిర్వహించిన తిరుపతి నగరంలోని కొందరు సిఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది,ఇతర ప్రాంతాల నుండి వచ్చిన పోలీసుల విధుల నిర్వహణపై విచారణ సాగుతోంది. అనంతపురం డిఐజి షిమోషిబాజ్‌పేయి, టిటిడి విజిలెన్స్ అధికారులు, జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ పూర్తిస్థాయిలో కీలకంగా తొక్కిసలాట ఘటనపై విచారణ సాగిస్తున్నారు. ఈ నివేదికలు మూడురోజుల్లో ప్రభుత్వానికి అందనున్నాయి. ఆ తరువాత తిరుపతి జిల్లాలో కొందరు సిఐలు, ఎస్ఐలు,పోలీసు సిబ్బందిపై బదిలీ వేటు పడే అవకాశం లేకపోలేదు. పైగా పోలీసుశాఖలో ఇంటెలిజెన్స్, ఎస్‌బి విభాగాల్లో సిబ్బంది పనితీరు కూడా అంతంతమాత్రంగానే మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

### అరుదైన పక్షులను వీక్షించి

## ప్రకృతిని ఆస్వాదించండి

### - జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ



బివిపాలెం పడవల రేవులో బోటు షికార్ చేస్తున్న జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, ఇతర అధికారులు

తడ, జనవరి 19 ప్రభాతవార్త ప్రతి ఒక్కరూ ఫ్లెమింగో ఫెస్టివల్ 2025ను సందర్శించి ఫ్లెమింగో, పెలికాన్ వంటి అరుదైన పక్షులను వీక్షించి ప్రకృతిని ఆస్వాదించాలని తిరుపతి జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ కోరారు. సందర్శకుల కోసం జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసిందని వారు తెలిపారు. ఆదివారం ఉదయం రెండోరోజు ఫ్లెమింగో ఫెస్టివల్ 2025 సందర్భంగా బివిపాలెం వద్ద ఏర్పాటు చేసిన బోటులో ఉత్సాహంగా షికారు చేస్తూ ప్రకృతిని ఆస్వాదిస్తున్న యువత, విద్యార్థులు, పలువురు పర్యాటకులు, ప్రజలతో కలిసి కలెక్టర్, ఎమ్మెల్యే బోటులో ప్రయాణించారు. ఈ సందర్భంగా వారు ఫ్లెమింగో ఫెస్టివల్ ఏర్పాట్లపై ప్రజల ప్రతిస్పందనను అడిగి తెలుసుకున్నారు. ఇంత అద్భుతంగా ఫ్లెమింగో ఫెస్టివల్‌ను ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని ప్రజలు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరికీ లైఫ్ జాకెట్ ఏర్పాటుతో పాటు గజ ఈతగాళ్లను ఏర్పాటు చేసి, అన్ని రకాల భద్రత చర్యలు తీసుకున్నామని తెలిపారు. అరుదైన ఫ్లెమింగో పక్షులను వీక్షించేందుకు వచ్చే ప్రజలకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి నాగరాజు, జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికార అధికారి చెన్నయ్య, అగ్నిమాపక శాఖ, ఇతర అధికారులు ఉన్నారు.

### పంటపొలాలపై

## ఏనుగుల గుంపు దాడి

### గజరాజుల దాడిలో ..నారావారిపల్లి ఉప సర్పంచ్ మృతి



చంద్రగిరి, జనవరి 19 ప్రభాతవార్త: కందులవారిపల్లి (నారావారిపల్లి) పంచాయతీ మామిడిమానుగడ్డ వద్ద పంట పొలాలపై ఏనుగుల గుంపు శనివారం అర్ధరాత్రి చొరబడ్డాయి. గ్రామస్తులకు తెలియడంతో అందరూ వెళ్లి వాటిని తరమడానికి వెళ్లగా ఏనుగులు ఉపసర్పంచ్ రాకేష్ చౌదరిపై దాడి చేసి తొక్కి వేశాయి. రాకేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఇతను నారావారి కుటుంబానికి, తెలుగుదేశం పార్టీకి అత్యంత విధేయుడుగా ఉండేవాడు. రైతుల కథనం మేరకు పంట పొలాల్లోకి ఏనుగుల గుంపు చొరబడినట్లు తెలిసి పది మందికి పైగా వెళ్ళినట్లు తెలిపారు. ఏనుగులను తరిమి కొట్టామనీ, అయితే ఒక గున్నఏనుగు తప్పిపోవడంతో గున్న ఏనుగు అరుపులు విని పెద్ద ఏనుగు తిరిగి రావడంతో టార్చ్ లైట్లు వెలుతురులో మాపై దాడికి రావడంతో పరుగులు పెట్టినట్లు వివరించారు. అయితే రాకేష్ ఏమరుపాటుతో వుండటంతో టార్చిలైట్ ఆపలేదనీ, దీంతో ఏనుగు అతన్ని తొండంతో కొట్టి, కాలితొక్కడంతో అక్కడికక్కడే మరణించినట్లు తెలిపారు. మృతి సమాచారం అందిన వెంటనే ఎమ్మెల్యే పులివర్తి నాని హుటాహుటిన మామిడిమాను గడ్డకు చేరుకుని డిఎస్పీ ప్రసాద్, సిఐ సుబ్బరామిరెడ్డి, గ్రామస్థులతో పరిస్థితిని సమీక్షించారు. పంటపొలాల నుండి రాకేష్ మృతదేహాన్ని గ్రామానికి తీసుకురావడంతో ఒక్కసారిగా కుటుంబ సభ్యులు, గ్రామస్థుల ఆర్తనాదాలతో గ్రామంలోని ప్రతి ఒక్కరి గుండె భాధతో బరువెక్కింది. ఈ క్రమంలో రాకేష్ తల్లి, భార్య, ఏడాది కుమార్తె కన్నీటిపర్యంతమవుతండగా ఈ క్రమంలో రాకేష్ కుటుంబ సభ్యులను ఓదార్చిన ఎంఎల్‌ఏ అండగా వుంటానని ధైర్యం చెప్పారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చంద్రగిరి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసుల శవపంచనామా, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని మామిడిమాను గడ్డకు తరలించారు. టిడిపికి రాకేష్ చేసిన సేవలను గౌరవిస్తూ పార్టీ జెండాను ఆయన భౌతికకాయంపై కప్పారు. ఎంఎల్‌ఏ పులివర్తి నాని, పులివర్తి సుధారెడ్డి, పులివర్తి వినీల్, టిడిపి మండల అధ్యక్షుడు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, కార్యదర్శి కొండూరు ప్రవీణ్ రాయల్, గౌస్‌భాషా, ఏజి పల్లి బాల, శానంబట్ల తులసిరెడ్డి, పలువురు నాయకులు, కార్యకర్తలు, బంధు మిత్రులు రాకేష్ భౌతికకాయంపై పూలమాలలువేసి నివాళులర్పించారు.

#### ఉమ్మడి చిత్తూరు జిల్లాలో

### ఏనుగుల బెడద తీరేదెన్నటికీ..?

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఈ ఏనుగుల బెడద తీరేదెన్నటికీ అంటూ రైతులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. వికోట, కుప్పం ప్రాంతాలతో పాటు ఏ.రంగంపేట నుండి మూలపల్లి మధ్యన ఏటా ఏనుగుల రాక సర్వసాధారణమయ్యింది. ఈ ప్రాంతంలో ఏనుగుల దాడులతో రైతులు అనేక మార్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ ప్రభుత్వం నుండి సరైన లేకపోవడంతో ప్రాణాలు పోగొట్టుకున్న సందర్భాలు వున్నాయి. వాస్తవానికి శేషాచల అడవులకు సోలార్ ఫెన్సింగ్ వేయడం ద్వారా ఎర్రచందనం అక్రమ రవాణాను సైతంఅడ్డుకున్నట్లు కాగలదు. ఆ మేరకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని ఆశిద్దాం.

## తిరుపతిలో రీజనల్ ఫోరెన్సిక్ సైన్స్ లాబరేటరీ ప్రారంభం

### వర్చువల్ ద్వారా ప్రారంభించిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా



తిరుపతి కార్పొరేషన్, జనవరి 19, ప్రభాతవార్త నూతనంగా ప్రారంభమైన రీజనల్ ఫోరెన్సిక్ సైన్స్ లాబరేటరీ 1,2 భవనాలను కేంద్ర హోం మంత్రి అమిత్ షా వర్చువల్ ద్వారా ప్రారంభించారని జిల్లా ఎస్పి విఎన్ మణికంఠ చందోలు అన్నారు. ఈ కార్యక్రమం విజయవాడ వేదికగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, డిజిపి ద్వారకా తిరుమల రావు, ప్రముఖులు హాజరై ప్రారంభోత్సవం చేశారని జిల్లా ఎస్పి తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పి మాట్లాడుతూ తిరుపతిలో నూతనంగా ప్రారంభమైన డిఎస్ఏ విభాగం ఫోక్సో కేసులు, ఇతర గంభీరమైన కేసులకు సంబంధించిన డిఎన్ఏ శాంపిళ్లను ఇక్కడనే టెస్ట్ చేయడం జరుగుతుందన్నారు. ఒకప్పుడు విజయవాడకు పంపాల్సిన అవసరం ఉండేదని ఈ సేవలను తక్షణమే స్థానికంగా పొందడం సులభమవుతోందని అన్నారు. ప్రత్యేకంగా ఆడియో, వీడియో టేపులను సంబంధించి నేర పరిశోధనలు, నేర ఆధారాల సేకరణ ఇక్కడ నిర్వహించడం జరుగుతుందని ప్రస్తుత రోజుల్లో సైబర్ నేరాలు రోజు రోజుకి పెరిగి సమస్యగా మారుతున్న నేపథ్యంలో, సైబర్ నేరాలు దృష్టిలో ఉంచుకుని చిన్న చిన్న ఆధారాలను కూడా నిశితంగా పరిశీలించేందుకు ఈ ల్యాబ్ ప్రాముఖ్యత కలిగి ఉంటుందని అన్నారు. అలాగే ఈ ఫోరెన్సిక్ ల్యాబ్ ఆధ్వర్యంలో నేర విచారణలో సాంకేతిక నైపుణ్యాలను వినియోగించి,న్యాయవ్యవస్థలో న్యాయం వేగవంతంగా జరగాలని ఎస్పి ఆకాంక్షించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పి వెంకట్రావు, రవి మనోహరాచారి, జేడి వి ఈశ్వరమ్మ, డీఎస్పిలు, ఎస్బి గిరిధర, తిరుపతి వెంకటనారాయణ, రామకృష్ణ ఆచారి, ట్రాఫిక్, ఏఆర్ డిఎస్పి రవీంద్రారెడ్డి, సిఐలు రామకిషోర్, అలిపిరి రామయ్య, యూనివర్శిటీ ఎంటిఓ ఆర్ఐ రాజశేఖర్ రెడ్డి, ల్యాబ్ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

## ప్రజాకవి యోగి వేమన

### - వేమన చిత్రపటానికి నివాళులర్పించిన కలెక్టర్



చిత్తూరు, జనవరి 19 ప్రభాతవార్త: పామరులకు సైతం అర్థమయ్యే భాషలో పద్యాలు చెప్పిన ప్రజాకవి యోగి వేమన అని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని పాత గ్రీవెన్స్ హాలులో ఆదివారం ప్రజాకవి యోగి వేమన జయంతిని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ సుమిత్‌కుమార్, జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడులు యోగి వేమన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ వేమన పద్యాలు తెలుగు వారికి సుపరిచితమని, ఆట వెలదిలో సరళమైన రీతిలో హృదయా లకు హత్తుకునే విధంగా యోగి వేమన పద్య రచన చేశారన్నారు. యోగి వేమన జయంతిని ప్రతి ఏడాది జనవరి 19న రాష్ట్ర పండుగగా నిర్వహించాలని ప్రభు త్వం నిర్ణయించడం జరిగిందన్నారు. యోగి వేమన సమాజ చైతన్యానికి అవ సరమైన సలహాలు, సూచనలు, విలు వలతో కూడిన రచనలు చేసేవారన్నారు. అలాగే వేమన ప్రతి పద్యానికి విశ్వదా భిరామ వినురవేమ అనే మకుటం చేర్చే వారన్నారు. మానవుని హీనస్థితికి కారణ మైన వ్యవస్థలపై వేమన తిరుగుబాటు చేశారన్నారు. ఐక్యరాజ్యసమితి యునెస్కో విభాగం ప్రపంచ భాషా కవుల్లో ఒకరిగా యోగి వేమనను గుర్తించడం జరిగిందన్నారు. ఇది తెలుగువారికి దక్కిన గొప్ప గౌరవం అని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిసీ సంక్షేమశాఖ అధికారి రబ్బానీభాష, పంచాయతీరాజ్ ఎస్ఇ చంద్రశేఖర్‌రెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామాల్లో ప్రబలుతున్న విషజ్వరాలు ...పట్టించుకోని అధికారులు

నాయుడుపేట జనవరి 19 ప్రభాతవార్త; నాయుడుపేట మండలంలోని అన్నమేడు,కాలవగట్టు,మర్లపల్లి, చిలమత్తూరు,కూచివాడ,కాపులూరు,కల్లిపేడు,పండ్లూరు,గొట్టిప్రోలు,పప్రాడేరు,మేనకూరు,తదితర గ్రామాల్లో ప్రజలు విషజ్వరాలు,దగ్గు, జలుబు,తుమ్ములు ప్రబలి అవస్థలు పడుతున్న వైద్యఆరోగ్యశాఖ అధికారులు పట్టించుకోక పోవడంతో నాయుడుపేటలోని ప్రవేటు ఆసుపత్రుల చుటు పరుగులు తీస్తున్నారు.అసలే సీతకాలం కావడంతో వైద్యఆరోగ్యశాఖ అధికారులు గ్రామాల్లో పర్యటించి గ్రామీణ ప్రజలకు సీజనల్ వ్యాదులు,ఆరోగ్యంపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాల్సి ఉండగా వైద్యదికారులు అటువైపు కన్నెత్తి సూచిన దఖలాలు కనిపించడంలేదని గ్రామీణ ప్రజలు ఆరోపిస్తున్నారు.గ్రామాల్లో ప్రజలకు జ్వరం,తలనొప్పి,జలుబు,దగ్గు, తుమ్ములు,వాంతులు, విరేచనాలు,కాళ్ళునొప్పులు రావడంతో హెచ్ఎంపివీ వైరస్ గుబులు పట్టుకొంది.ఇప్పటికే పక్కరాష్టాలో కేసులు నమోదు కావడంతో జ్వరం వస్తేప్రజలు వామ్మో ఎచ్ఎంపివీ వైరస్ అంటూ హడలిపోతున్నారు. ప్రభుత్వ వైద్యశాలకు వెళ్ళితే అక్కడ పనిచేసే సిబ్బంది సక్రమంగా పట్టించుకోకపోగా వారు ఇచ్చిన మందులకు జ్వరాలు తగ్గడంలేదని వాపోతున్నారు.నాయుడుపేటలోని ప్రవేటు వైద్యశాలలకు వెళ్ళగా అక్కడ రక్తపరీక్షల పేరుతో వేలకువేలు వసూళ్ళు చేస్తున్నారే గానీ జ్వరాలు తగ్గడంలేదన్నారు.జ్వరం,దగ్గు,తుమ్ములు తగ్గకపోవడంతో మెరుగైనవైద్యం కోసం నెల్లూరు-చెన్నై-తిరుపతి కార్పోరేటు ఆసుపత్రుల చుట్టు పరుగులు తీస్తున్నారు.మరికొంత మంది జ్వరాలతో గ్రామాల్లో మంచాల్లో మగ్గుతున్నారు.ఇంతజరుగుతున్న వైద్యశాఖ అధికారులు పట్టిచుకోవడంలేదని గ్రామీణ ప్రజలు ఆరోపిస్తున్నారు.ఇప్పటికైనా జిల్లాఉన్నాతాధికారులు స్పందించి గ్రామాల్లో మెడికల్ క్యాంప్‌లు ఏర్పాటుచేసి విషజ్వరాలని నియంత్రించాలని ఆయాగ్రామాలు ప్రజలు కోరుతున్నారు.

## ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌గా భరత్‌రెడ్డి

### - జిల్లా కలెక్టరేట్‌లో బాధ్యతల స్వీకరణ



తిరుపతి కలెక్టరేట్, జనవరి 19 ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ ఐఐసీ జోనల్ మేనేజర్‌గా వి.భరత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు.ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చిన ఉత్తర్వులు మేరకు జిల్లా కలెక్టరేట్‌లో పూర్తి బాధ్యతలు స్వీకరించారు.ఈయన స్థానంలో ఉన్న చంద్రశేఖర్ బదిలీపై వెళ్ళారు.భరత్‌రెడ్డి ప్రకాశం జిల్లా గిద్దలూరు మండలం తంబళ్ళపల్లి గ్రామంలో తల్లిదండ్రులు నారాయణమ్మ,వీరారెడ్డిల కుమారుడు భరత్‌రెడ్డి. బీఎస్సీ,ఎంఈడీ ఉన్నత చదువులు పూర్తి చేసుకుని మొదటి సారిగా భరత్‌రెడ్డి కృష్ణాజిల్లాలో 12 సంవత్సరాలుగా రెవెన్యూ శాఖలో తహశీల్దార్‌గా పనిచేశారు. ఏపీపీఎస్సీ గ్రూపు-2 పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి డెప్యూటీ కలెక్టర్ హోదాలో తిరుపతి జిల్లాలో మొదటి సారిగా అడుగుపెట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల మేరకు తిరుపతి జిల్లా కలెక్టరేట్‌లో శనివారం ఆంధ్రప్రదేశ్ ఐఐసీ జోనల్ మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టారు. జిల్లా, జోనల్ పరిధిలోని సంబంధిత శాఖాధికారులు, సిబ్బంది పెద్ద ఎత్తున జిల్లా కలెక్టరేట్‌లోని ఏపీఐఐసీ జోనల్ కార్యాలయానికి విచ్చేసి భరత్‌రెడ్డికి ఘన స్వాగతం పలికి శాలువ, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించి అభినందించారు.

## అకాల వర్షం : అన్నదాతకు కష్టం

### జనవరిలో ఎడతెరపి లేని వర్షాలు-:పంటలకు తెగుళ్ళు

శ్రీకాళహస్తి,జనవరి 19 ప్రభాతవార్త 'జనవరిలో వర్షాలేమిటి స్వామీ!అంటూ' రైతులే కాక జనం ఆందోళన చెందుతున్నారు.శనివారం రాత్రి నుంచి ఆదివారం వేకువ జాము వరకు ఎడతెరపిలేని వర్షాలు కురిసాయి. జనం ఊహించని రీతిలో శనివారం ఉదయం నుంచి ఆకాశంలోమబ్బులు చోటు చేసుకున్నాయి. ఎముకలు కొరికే చలితో తల్లడిల్లారు. వాహానాలకు దారి కనబడలేదు. లైట్లలోనే నడపాల్సి వచ్చింది. అయితే ఆదివారం వేకువ జాము 3 నుంచి 6 గంటల వరకు వర్షాకాలంలో కూడా కురవని రీతిలో వర్షం కురిసింది. దాంతో వీధులన్ని జలమయమయ్యాయి. సాధారణం ఈ ప్రాంతాల్లో డిసెంబర్ చివరి వారం వరకు మాత్రమే వర్షాలు కురుస్తాయి. అలాంటిది ఈ ఏడాది గత పాతికేళ్ళుగా లేని విధంగా జనవరిలో వర్షం కురువటం పలువురిని ఆశ్చర్య పరుస్తుంది. జనవరి మొదటి వారం నుంచి వర్షాలు కురుస్తూనే ఉన్నాయి.



శ్రీకాళహస్తిలో ఆదివారం వేకువ జామున కురిసిన వర్షం

దాంతో వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అలాగే ఆలయానికి వచ్చిన భక్తులు తిప్పలు వర్ణనాతీతంగా మారింది.రెవెన్యూ వర్గాలు అందించిన సమాచారం మేరకు శ్రీకాళహస్తి 35.2మి.మీలు, తొట్టంబేడు 40 మి.మీలు, ఏర్పేడు 32.2 మీ.మిల వర్షపాతం నమోదైనట్లు తెలిపారు.

#### పంటలకు తెగుళ్ళు: రైతులకు కన్నీరు:

గత మూడు నెలలుగా ఎడతెరపి లేని వర్షాలతో రైతుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. అక్టోబర్ మాసంలో సాధారణం కన్నా 100 మి.మీలు అధికంగా వర్షపాతం నమోదైంది.దాంతో రైతులు ముందస్తు వరి పంటలకు నార్లు పోసుకున్నారు. నవంబర్‌లో వరుణ దేవుడు కరుణించటంతో రైతుల ఆనందానికి హద్దుల్లేదు, పోలోమని పంటలను వేసుకున్నారు. డిసెంబర్‌మాసంలో ఊహించనిరీతిలో వర్షాలు కురిసాయి. దాంతో వేసిన పంటలకు తెగుళ్ళు ఆశించాయి. ఎండ కనబడకపోవటంతో రైతులు వేసిన పంటలను కాపాడుకోవటానికి అధికారుల సూచనలు ఖాతరు చేయక పంటలకు తెగుళ్ళ మందును వాడారు.దాంతో పంటలు బాగా దెబ్బతిన్నాయి. అసలే తెగుళ్ళతో తల్లడిల్లుతూ పంటలను కాపాడుకోవటానికి తిప్పలు పడుతుండగా మళ్ళీ ఆదివారం వేకువ జామున కురిసిన వర్షాలతో రైతు దిక్కుతోచని స్థితి ఏర్పడింది.

#### వ్యవసాయశాఖ స్పందించాలి:

వ్యవసాయశాఖ అధికారులు కార్యాలయాల్లో కూర్చొని సూచనలిచ్చే విధానాలకు స్వస్తి చెప్పి గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో వెళ్ళి పరిశీలించి వరి పంటకు ఆశించిన తెగుళ్ళు ఏమిటి? దానికి ఏ మందులు వాడాలి? అనే అంశాలకు సంబంధించి అధికారులు సూచించాల్సి ఉంది.

## నేటి కానిస్టేబుల్ అభ్యర్థుల అప్పీల్ వాయిదా

**చిత్తూరు, జనవరి 19 ప్రభాతవార్త:**

చిత్తూరు పోలీసు శిక్షణా మైదానంలో ప్రస్తుతం జరుగుతున్న కానిస్టేబుల్ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియకు సంబంధించి అభ్యర్థుల అప్పీల్ కార్యక్రమంను ఈ నెల 22వ తేదీకి వాయిదా వేసినట్లు ఎస్పీ మణికంఠ చందోలు ఓ ప్రకటనలో తెలిపారు. కానిస్టేబుల్ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియకు సంబంధించి అప్పీల్ కార్యక్రమంను సోమవారం నిర్వహించాలని ముందు నిర్ణయించడం జరిగిందని, అయితే చిత్తూరు జిల్లాలో అకాల వర్షాలు కురుస్తుండటంతో ఈ అభ్యర్థుల అప్పీల్ ప్రక్రియను బుధవారం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. అప్పీల్ చేయదలచిన అభ్యర్థులు ఈ నెల 22వ తేదీ పోలీసు శిక్షణా మైదానంకు హాజరై తమ అప్పీళ్ళను చేసుకోవచ్చునన్నారు.

## నేడు పోలీస్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్

**చిత్తూరు, జనవరి 19 ప్రభాతవార్త:**

ప్రజా సమస్యలను పరిష్కరించడానికి జిల్లా పాత పోలీసు కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంను నిర్వహిస్తున్నట్లు ఎస్పీ మణికంఠ చందోలు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజలు తమ సమస్యలు పోలీసు ఉన్నత అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవచ్చునని ఎస్పీ తెలిపారు.

## ముందు కులగణన ఆపై ఎస్సీ వర్గీకరణ



**చిత్తూరు, జనవరి 19 ప్రభాతవార్త:**

కుల గణన చేపట్టిన అనంతరం ఎస్సీ వర్గీకరణకు చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దళిత సంక్షేమ సేవా సంఘం అధ్యక్షులు చంద్రశేఖర్ ప్రభుత్వంను డిమాండ్ చేశారు. ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీలకు క్రిమిలేయర్ విధానం అమలు చేయడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం వున్న జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లను ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎస్సీల సంక్షేమం కోసం ప్రభుత్వం అందించే రాయితీలు క్షేత్ర స్థాయి వరకు చేరడం లేదని ఆయన ఆరోపించారు. ఫలితంగా క్షేత్ర స్థాయిలో ఎస్సీలకు ఎలాంటి లబ్ది చేకూరడం లేదని, అలాగే ప్రభుత్వం ఆశించిన ఫలితాలు రావడం లేదని పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఎస్సీలు అభివృద్ధి చెందకుండా అణచివేసిందని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం తమకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన నిధులను వారి అభివృద్ధికి మాత్రమే వినియోగించేలా ప్రస్తుత కూటమి ప్రభుత్వం స్పష్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎపి రాష్ట్ర దళిత సంక్షేమ సేవా సంఘ జిల్లా అధ్యక్షులు శివాజీ, నాయకులు గోపినాథ్, గోపాలయ్య, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

**చిత్తూరు, జనవరి 19 ప్రభాతవార్త:**

ప్రజా సమస్యలను పరిశీలించి పరిష్కరించడానికి కలెక్టరేట్‌లోని నూతన సమావేశభవనంలో సోమవారం ఉదయం 9.30 గంటల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు అందరు తప్పక హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే నియోజకవర్గ, మండల స్థాయిలో సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి నియోజకవర్గ, మండల స్థాయి అధికారులు అందరు హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు.

## వరుస ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలు

**శ్రీకాళహస్తిరూరల్, జనవరి 19 ప్రభాతవార్త**



అన్నదాతల్లో ఆందోళన మొదలైంది. పంటపొలాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లును కొందరు చోరీ చేసి తీసుకెళ్తున్నారు. శనివారం రాత్రి మండలంలోని పోలి గ్రామంలోని దామోదర్‌రెడ్డి పంటపొలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి అందులోకి రాగివైరును చోరీ చేసి తీసుకెళ్ళారు. కాగా వాంపల్లి గ్రామంలో ఉన్న ఆలయం తాళాలును పగులగొట్టేందుకు దొంగలు ప్రయత్నించినట్లు సమాచారం.

## శివయ్య సేవలో చిత్తూరు కలెక్టర్

**శ్రీకాళహస్తి, జనవరి 19 ప్రభాతవార్త**



దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వ రాలయంలో వెలసిన స్వయంభువు వాయులింగేశ్వరుని సేవలో ఆదివారం చిత్తూరు కలెక్టర్ సుమిత్‌కుమార్ కుటుంబస భ్యులతో హాజరయ్యారు. వారికి దక్షిణ గోపురం వద్ద ఆలయ ఇఒ బాపిరెడ్డి ఆదేశాలతో డెప్యూటీ ఇఒ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి వేదపండితులతో స్వాగతం పలికారు. ఆలయంలోని స్వామి అమ్మవార్ల అంతరాలయంలో స్వామి అమ్మవార్లను దర్శించుకున్న వారికి మృత్యుంజయ ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు ఏర్పాటు చేసారు. స్వామి అమ్మవార్ల చిత్రపటాలను అందించారు. ఏర్పాట్లను ఎఇఒ విద్యాసాగర్‌రెడ్డి టెంపుల్ ఇన్స్పెక్టర్ హరియాదవ్‌లు పర్యవేక్షించారు.

## భక్తులతో స్నేహభావం అవసరం : ఏకాంబరం

**–కొండనిండిన భక్తజనం**

**బోయకొండ(చౌడేపల్లి), జనవరి 19 ప్రభాతవార్త**



శక్తిక్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయానికి తరలివచ్చే భక్తులతో స్నేహభావం అవసరమని ఆలయ ఇఒ, ఉపకమీషనర్ ఏకాంబరం సిబ్బందికి సూచించారు. ఆదివారం కొండదినం కావడంతో ఆయన క్యూలైన్లను పర్యవేక్షించారు. భక్తుల మౌళిక వసతులను పరిశీలించి వారిని అడిగి తెలుసుకొన్నారు. ఉదయాన్నే అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో అమ్మవారికి విశేషాభిషేకం, అలంకరణ గావించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యూలైన్లన్నీ భక్తులతో కిటకిటలాడాయి. మూలస్థాన అమ్మవారి ఆలయంలో మరిన్ని సేవలు కల్పించారు. ఆలయ అధికార, అర్చక, సిబ్బంది యాత్రీకులకు వసతులను సమకూర్చారు.

## శివ శివా తప్పును మన్నించు...!

**-ఆలయానికి ఎదురుగానే పాదరక్షకులు**

**చౌడేపల్లి, జనవరి 19 ప్రభాతవార్త**



లోక పాలకునికి దర్శనానికి వచ్చే భక్తునికి ఆలయం ఎదురుగా పాదరక్షకులు కనిపిస్తూ భక్తులను కలవర పెడుతున్నాయి. పరమశివుడికి నేరుగా చెప్పులు విడచిపెట్టడం తగదని చెప్పేవారే కరువయ్యారని భక్తులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. స్థానిక శ్రీ అభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి ఆలయానికి నిత్యం విశేష సంఖ్యలో భక్తులు తరలి వస్తుంటారు. రాష్ట్రం నుంచి కాకుండా ఇతర ప్రాంతాలకు చెందిన శివభక్తులు అధిక సంఖ్య లో స్వామి వారి ఆలయానికి వచ్చి అభిషేకాధి పూజల్లో పాల్గొంటారు. అయితే ఆలయం ముందున్న మండపానికి ఎదురుగా భక్తులు పాదరక్షకులు విడచి ఆలయంలోకి వెళుతున్నారు. దీంతో ఆ ప్రాంతం చెప్పులతో నిండిపోయి కనిపిస్తోంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సి వుందని భక్తులు కోరుతున్నారు.

**స్టాండు ఏర్పాటు చేయిస్తాం : ఇఒ కమలాకర్‌రావు**

ఆలయం ముందున్న మండపం వద్ద భక్తులు ఎక్కడ పడితే అక్కడ పాదరక్షకులు విడచి పెడుతున్న విషయం వాస్తవమేనని పుంగనూరు గ్రూప్ టెంపుల్స్ ఇఒ కమలాకర్‌రావు అన్నారు. పరిశీలించి ఆలయ ఆవరణంలోనేపాదరక్షకులుభద్రపరచుకొనే స్టాండును ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకొంటా మన్నారు.

## పెద్ద ఉప్పరపల్లిలో వేడుకగా జల్లికట్టు



**సోమల, జనవరి 19, ప్రభాతవార్త**

మండలంలోని పెద్ద ఉప్పరపల్లి గ్రామంలో ఆదివారం వేడుకగా జల్లికట్టు కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలో రంగంపేట తర్వాత పెద్ద ఉప్పరపల్లి జల్లికట్టు అత్యంత ప్రాముఖ్యమైనదిగా భావిస్తారు. జల్లికట్టు కార్యక్రమాన్ని చూసేందుకు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు రావడం జరుగుతుంది. తమిళనాడు నుంచి కూడా పశువులను ఇక్కడికి పోటీకి తీసుకువస్తారు. ఉదయం నుంచి వర్షం కురవడంతో కార్యక్రమం కాస్త ఆలస్యంగా ప్రారం భమైంది. పశువులను పట్టుకునేందుకు యువకులు ఉత్సాహంగా ముందుకు వచ్చారు. స్వల్ప గాయాలు మినహా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకపోవడంతో గ్రామ పెద్దలు ఊపిరి పీల్చుకున్నారు.

## కుప్పం మున్సిపాలిటీలో వందశాతం పారిశుద్ధ్యానికి ప్రాధాన్యత

**– మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు**

**కుప్పం, జనవరి 19 ప్రభాతవార్త**



కుప్పం మున్సిపాలిటీలో వందశాతం పారిశుద్ధ్యానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. సిఎం చంద్రబాబునాయుడు పిలుపు మేరకు ప్రతి నెలా మూడో శనివారం స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర స్ఫూర్తితో ఇళ్ల నుంచి వందశాతం చెత్త సేకరణతో పాటు తడిపొడి చెత్తలను వేరుచేసి చెత్తకుప్పలు లేని సమాజం కోసం తమవంతుగా కుప్పం మున్సిపా లిటీని స్వచ్ఛ మున్సిపాలిటీగా మార్చేందుకు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్రజలు కూడా మున్సిపల్ పరిధిలో తమ ఇళ్ల వద్దకే వస్తున్న ట్రాక్టర్లలోనే చెత్తను వేసి స్వచ్ఛ కుప్పంకు సహకరించాలని కోరారు. అలాగే పట్టణంలో పారిశుద్ధ్యం పను రోజూ పగలు, రాత్రి చేపడుతున్నామన్నారు. అలాగే ప్రజలకు తాగునీటి సౌకర్యం, పచ్చదనంపై ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు.

## గూళ్లపల్లిలో గోకులం షెడ్లు ప్రారంభం



**రామకుప్పం, జనవరి 19 ప్రభాతవార్త**

మండలంలోని గూళ్లపల్లి గ్రామంలో పాడి రైతులు రాయితీతో నిర్మించుకున్న గోకులం షెడ్లను మండల టిడిపి అధ్యక్షుడు ఆనందరెడ్డి, నేతలు శ్రీనివాసులురెడ్డి, రామూర్తి, జయశంకర్ తదితరులు ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రకృతి వ్యవసాయ విధానాల వైపు రైతులు మొగ్గు చూపాలన్నారు. రైతుల సంక్షేమంకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో నేతలు కృష్ణారెడ్డి, బాలరాజు, మహేంద్రనాయుడు, మురళీమోహన్, శంకరాచలం, మనేష్, రామలింగం, సుభాష్, ఆంజనేయులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

## నేటినుంచి కుప్పం మండలంలో పశు ఆరోగ్య శిబిరాలు

**కుప్పంరూరల్, జనవరి 19 ప్రభాతవార్త**

కుప్పం మండలంలో పాడి రైతుల సౌకర్యార్థం పశుసంవర్ధక శాఖచే పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ తెలిపారు. సోమ వారం వెండుగంపల్లి, దాసేగానూరు, చందం గ్రామాల్లో ఈ శిబిరాలు జరుగుతా యన్నారు. 21న పిబి నత్తం, జరుగు, 22న నడిమూరు, గుడ్లనాయనపల్లి, నూలు కుంట, 23న మంకలదొడ్డి, కెడిపల్లి, 24న ఉర్ల ఓబనపి , చీలేపల్లి, 25న వానగు ట్టపల్లి, సామగుట్టపల్లి, 26న చెక్కునత్తం, వసనాడు, 27న పైపాళ్యం, లక్ష్మీపురం, 28న గోనుగూరు, కంగుంది, మల్లానూరు, 29న జిసిపల్లి, మహ్మద్‌పురం, కొత్తపల్లి, 30న కొటాలూరు, మిట్టపలి , నాయనూరు, 31న బిడిచేన్లు, దేవరాజురం, అడవిబూదుగూరు గ్రామాల్లో శిబిరాలు జరుగు తాయన్నారు. పశుఆరోగ్య శిబిరాల నిర్వహణకు పశుసంవర్ధక శాఖాధికారులు మూడు బృందాలుగా ఏర్పడి గ్రామాల్లోశిబిరాలునిర్వహిస్తారన్నారు. రైతులుఈఅవకాశాన్ని సద్వినియోగం

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## హత్య కేసులో నిందితుడి అరెస్టు

**పలమనేరు, జనవరి 19, ప్రభాతవార్త:**



అక్రమ సంబంధం ఓ నిండు ప్రాణాన్ని బలి తీసుకున్న కేసులో నిందితుడిని ఆదివారం పలమనేరు పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో డిఎస్పీ డి.ప్రభాకర్ ఆధ్వర్యంలో నిందితుడిని రిమాండ్ చూపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని పాతపేటకు చెందిన సయ్యద్ మౌలానా భాషా కుమారుడు సయ్యద్ షమీర్(30) గుడియాత్తం రోడ్డు నందు బిర్యాని సెంటర్ నిర్వహిస్తున్నాడని, ఈ క్రమంలో షమీర్ వద్ద పని చేస్తున్న పలమనేరు మండలం, పెంగరగుంట పంచాయితీ ముసలిమడుగుకు చెందిన శివకుమార్ భార్య ఉషారాణితో గత కొంత కాలంగా అక్రమ సంబంధం పెట్టుకోవడం జరిగిందన్నారు. ఈ విషయం శివకుమార్‌కు తెలియడంతో షమీర్ ఉషారాణిని తీసుకుని గత ఏడాది డిసెంబర్ 3న బెంగళూరు వెళిపోగా విషయం తెలుసుకున్న శివకుమార్ పోలీసులకు ఫిర్యాదు చేస్తాలని షమీర్‌కు తెలపడంతో ఉషారాణిని తన పుట్టిలైన వేలూరు జిల్లా సదువాని గ్రామానికి పంపివేశాడు. అక్కడ పెద్దల సమక్ష్యంలో ఉషారాణిని మందలించి భర్త శివకుమార్‌తో పెద్దలు పంపివేయడం జరిగిందన్నారు. తన అక్రమ సంబంధానికి శివకుమార్ అడ్డుగా ఉన్నాడని ఈ నెల 13న షమీర్ శివకుమార్‌ను ఇకపై తన భార్య జోలికి రానని నమ్మింది ఇద్దరు మాట్లాడుకుండా అని పట్టణానికి శివకుమార్‌ను పిలిపించి స్థానికంగా మద్యం తీసుకుని నీలకుంట సమీపంలోని పెట్రోల్ బంక్ వెనుకవైపు పొలంలో ఇద్దరు మద్యం సేవించి శివకుమార్‌ను అక్కడే ఉన్న బండరాయితో కొట్టి చంపి పారిపోయాడని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి ఆదివారం బంగారుపాళ్యం మండలం, మొగిలి వద్ద నిందితుడు షమీర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని డిఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ నరసింహరాజు, ఎస్ఐ స్వర్ణతేజ ,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పట్టణంలో ఘనంగా యోగి వేమారెడ్డి జయంతి వేడుకలు

**-రెండు వర్గాలైన రెడ్డి సోదరులు – రెండు ప్రాంతాలలో వేడుకలు**

**పలమనేరు, జనవరి 19, ప్రభాతవార్త:**

పట్టణంలో ఘనంగా యోగి వేమారెడ్డి జయంతి వేడుకలు ఆదివారం నిర్వహించారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రభుత్వ కార్యాలయాలలో ఘనంగా జయంతి వేడుకలను నిర్వహించారు. మండలంలో రెడ్డి సోదరులు ఇరువర్గాలు కావడంతో పట్టణంలోని పెట్రోల్ బంక్ వద్ద ఓ వర్గం వారు యోగి వేమారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి అన్నదాన కార్యాక్రమం నిర్వహించారు. మరో వర్గం వారు అధికారికంగా నాగమంగళం వద్ద ఏర్పాటు చేసిన యోగి వేమారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి జయంతి వేడుకలను నిర్వహించారు. అనంతరం వందకు పైగా పద్యాలను ఆలపించిన చిన్నారులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమాలలో స్థానిక రెడ్డి సంఘం నాయకులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## రైతు బిడ్డగా పుట్టడమే శాపమా!

**కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఇన్చార్జి ముట్టుకురు జగపతి**

**పూతలపట్టు, జనవరి 19, ప్రభాతవార్త**

రైతే దేశానికి వెన్నుముక అంటారు. అలాంటి రైతును ఆదుకోకపోతే భవిష్యత్ అంధకారం అవుతుందని చిత్తూరు కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఇన్చార్జి ముట్టుకురు జగపతి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగస్తులకు మాత్రమే వివాహం చేసుకోవడానికి అమ్మాయిని ఇస్తున్నారని ఈ దేశానికే వెన్నుముక్క అయిన రైతులకు, రైతు బిడ్డలైన యువ రైతులకు వివాహం చేయడానికి అమ్మాయిలను ఇవ్వడానికి సంశాయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు లేకుంటే భవిష్యత్తులో పంటలు పండించేది ఎవరని ప్రశ్నించారు. తిండి కోసం యుద్ధం చేయాల్సిన రోజులు వస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. పాడి ద్వారా బతుకుదామనుకున్నా రైతుకు కష్టాలు తప్పట్లేదన్నారు. ప్రైవేట్ డైరీలు అధికంగా ఉన్నాయని రైతులు పాలు పోస్తే లీటరుకు రూ. 27 ఇస్తారని అదే దుకాణాల్లో లీటర్ పాల ప్యాకెట్ రూ. 70 వరకు అమ్ముతున్నారని అన్నారు. రైతు జీవనం దుర్భరంగా మారిందని కనీసం రైతు బిడ్డలకు ఆడపిల్లలను ఇచ్చే పరిస్థితి లేదని వాపోయారు. ప్రభుత్వం పరిశ్రమలకు ఇచ్చినట్లు సబ్సిడీలు రైతులకు ఎందుకు ఇవ్వకూడదని అన్నారు. వ్యవసాయంలో నష్టంతో ఎంతో మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే అనేక మంది ప్రోత్సహించుకుంటే భవిష్యత్తు అంధకారమే అన్నారు.

## విజయవంతమైన వైదేహి వారాహి ఉచిత మెగా వైద్య శిబిరం

**పుంగనూరు, జనవరి 19, ప్రభాతవార్త**



వారాహి గ్రూప్స్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని లీనార్డ్ హైస్కూల్‌లో ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంత మైంది. బెంగళూరు వైదేహి హాస్పిటల్స్ సహకారంతో నిర్వహించిన ఈ మెగా వైద్య శిభిరంలో గుండె, కిడ్నీ, డయాలసిస్, ప్లాస్టిక్ సర్జరీ, యూరియాలజీ మెడికల్, గ్యాస్ట్రో ఎంట్రాలజీలకు సంబంధించిన సూపర్ స్పెషాలిటీ వైద్యులు, పుంగనూరు పరిసర ప్రాంతాల నుంచి విచ్చేసిన వందలాది మంది ప్రజలను పరీక్షించారు. ఈ సందర్భంగా పలు తీవ్రమైన వ్యాధిగ్రస్తులకు శస్త్ర చికిత్సలు నిర్వహించేందుకు ఎంపిక చేశారు. వారాహి గ్రూప్స్ చైర్మన్ హేమంత్ రాయల్ మాట్లాడుతూ పుంగనూరు నియోజకవర్గంలో అన్ని మండలాల్లో త్వరలో వైద్య శిబిరాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పేదలైన ప్రజలకు ఉచితంగా ఆరోగ్య పరీక్షలు అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పేదలైన ప్రజలకు ఉచితంగా ఆరోగ్య పరీక్షలు అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు నిర్వహించేందుకు ఎన్టీఆర్ ట్రస్ట్, వైదేహి హాస్పిటల్ వారి సౌజన్యంతో కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. పొన్నూరు పరిసర ప్రాంతాల నుంచి పాల్గొన్న వందల మందికి ఈ సందర్భంగా ఉచితంగా మాత్రలు, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వారాహి గ్రూప్స్ సంస్థ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

# కాంట్రాక్టర్ స్వలాభం - అధికారుల నిర్లక్ష్యం

**- బండివాండ్లవూరు గ్రామ రైతులకు తీరని నష్టం**

**- బండివాని చెరువు, సప్లై ఛానల్‌ను వ్యర్థాలతో నింపిన వైనం**



**చిత్తూరు, జనవరి 19 ప్రభాతవార్త:**

ఎక్కడైనా చెరువులో నీటి నిల్వలు పెంచడానికి ప్రస్తుతం వున్న చెరువుల్లో పూడిక తీయడంతో పాటు సప్లై ఛానళ్ళలో నీరు స్వేచ్ఛగా వెళ్ళడానికి కాలువల్లో వున్న అడ్డంకులను తొలగిస్తారు. అయితే యాదమరి మండలం మీదుగా చెన్నై-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం జరుగుతున్న యాదమరి మండలం మాధవరం పంచాయతీ బండివాండ్లవూరు గ్రామ పరిధిలోని బండివానిచెరువును ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణ పనుల కాంట్రాక్టర్ చెరువుతో పాటు సప్లై ఛానల్‌ను మూసి వేయడానికి పూనుకోవడంతో ఇక్కడి రైతులకు తీరని నష్టం జరిగింది. ఇక్కడి రైతులు ఈ విషయంను ఆలస్యంగా గుర్తించి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఈ మేరకు తహసిల్దారు పార్థసారధి స్వయంగా వెళ్ళి బండివాని చెరువులో దిబ్బలు దిబ్బలుగా పడవేసిన వ్యర్థాలను పరిశీలించి సత్వరం చెరువు నుండి వ్యర్థాలు తొలగించాలని, అలాగే సప్లై ఛానల్‌లో నీరు స్వేచ్ఛగా వెళ్ళేలా దారి ఏర్పాటు చేయాలని ఆదేశించి వచ్చారు. అయితే తహసిల్దారు ఆదేశాలు ఇప్పటి వరకు అమలు కాకపోవడంతో ప్రస్తుతం కురుస్తున్న అకాల వర్షాలతో అక్కడి రైతులు సప్లై ఛానల్‌లో వర్షపు నీరు ప్రవహించకుంటే సప్లై ఛానల్ పరిసర ప్రాంతాల్లోని బావులు పూడిపోయే ప్రమాదం వుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ రెవెన్యూ గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించడానికి వచ్చిన తహసిల్దారు పార్థసారధి దృష్టికి చెరువు పూడ్చివేత వ్యవహారంను తీసుకెళ్ళడం జరిగిందని, తహసిల్దారు స్వయంగా చెరువులోకి వచ్చి పరిస్థితులను పరిశీలించి ఇరిగేషన్ అధికారులను కాంట్రాక్టర్ ద్వారా చెరువులో వేసిన వ్యర్థాలను తొలగించాలని ఆదేశించడం జరిగిందని రైతులు పేర్కొంటున్నారు. అయితే ఈ విషయంపై ఇప్పటి వరకు ఇరిగేషన్ అధికారులు స్పందించకపోవడంతో కాంట్రాక్టర్ ఈ విషయంను పట్టించుకోవడం లేదని, దీంతో బండివానిచెరువు లోతు తగ్గిపోయి వ్యర్థాలతో నిండిపోయిందని రైతులు ఆరోపిస్తున్నారు. అలాగే బండివానిచెరువు సప్లై ఛానల్‌ను సైతం కాంట్రాక్టర్ పెద్ద పెద్ద రాళ్ళు అడ్డువేయడంతో సప్లై ఛానల్ మూసివేయబడిందని, ఈ సప్లై ఛానల్‌ను సైతం కాంట్రాక్టర్ బాగు చేయకపోవడంతో కొద్దిపాటి వర్షం కురిసినా సప్లై ఛానల్ పరిసర ప్రాంతాల్లోని వ్యవసాయ బావులపై ప్రభావం పడుతుందని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై ఇరిగేషన్ ఎఇ కిషోర్ స్పందిస్తూ బండివాని చెరువు పూడ్చివేసిన విషయం తనకు ఇప్పటి వరకు తెలియదని, ఈ విషయంపై తనను ఎవరు ఫిర్యాదు చేయలేదని, తాను స్థానికులతో మాట్లాడి విషయం తెలుసుకుని సమస్యను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. చెన్నై-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణ కాంట్రాక్టర్ స్వలాభం కోసం బండివాని చెరువు, దాని సప్లై ఛానల్‌ను వ్యర్థ రాళ్ళతో నింపి పూడ్చి వేయడం, ఈ వ్యవహారంను అడ్డుకుని రైతులకు న్యాయం చేయాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వుండటంతో బండివాని చెరువు పరిధిలోని రైతులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. భారీ వర్షాలు కురవకముందే అధికారులు ఈ విషయంపై సీరియస్‌గా స్పందించి బండివాని చెరువులో వేసిన వ్యర్థాలను తొలగించడంతో పాటు బండివాని చెరువు సప్లై ఛానల్‌లో నీటి ప్రవాహం సక్రమంగా వెళ్ళేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది.

## జనవరి 24 నుంచి అఖిలభారత యువజన సమాఖ్య మహాసభలు



**తొట్టంబేడు, జనవరి 19 ప్రభాతవార్త**

ఏఐవైఎఫ్ శ్రీకాళహస్తిలో తిరుపతి జిల్లా 2వ మహాసభలను జయప్రదం చేయాలని గోడపత్రికలు విడుదల చేయాలని ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉద్యోగాలన్నీ భర్తీ చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా2వ మహాసభలను శ్రీకాళహస్తి నియోజకవర్గంలో అంబేద్కర్ భవన్‌లో ఈనెల 24 నుంచి 25 వరకు జరుగుతున్నాయని నిరుద్యోగులతో భారీ బహిరంగ సభకు తరలిరావాలని అఖిల భారతీయ యువజన సమాఖ్య జిల్లా అధ్యక్ష్య కార్యదర్శులు కత్తిరవి, రామకృష్ణ, సిపిఐ కార్యదర్శి జనమాల గురవయ్యలు కోరారు. శ్రీకాళహస్తి సిపిఐ కార్యాలయంలో మహాసభలకు సంబందించి గోడపత్రికలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి మించలశివకుమార్, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు మల్లికార్జున్, శ్రీనివాసులు, సురేంద్రబాబు, ఎఐఎస్ఎఫ్ మునిచందు, రాజు, ముని తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ రహదారి సూపర్:గ్రామాలకు దారిలేక తిప్పలు

శ్రీకాళహస్తి,జనవరి 19 ప్రభాతవార్త




నాయుడుపేట-రేణిగుంట జాతీయ రహదారి సూపర్‌గా తీర్చి దిద్దారు. అయితే గ్రామాలకు సంబంధించిన దారిలేకుండా ఎటు వెళ్ళాలో తెలియక తిప్పలు పడుతున్నారు.ముఖ్యంగా శ్రీకాళహస్తి పట్టణానికి ఎలా రావాలో వాహనచోదకులు సుమారు పది కిలోమీటర్లు ముందుకు వెళ్లి తిరుక్కోవాల్సి వస్తోంది. అక్కడ కూడా కాంట్రాక్టర్ సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. ఎక్కడిక్కడ సర్వీసు రోడ్లు ఏర్పాటు చేసారు. కానీ సూచిక బోర్డులేనందువల్ల వాహన చోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.సుమారు 2వేల కోట్లతో నాయుడుపేట పూతలపట్టు మార్గాన్ని జాతీయ రహదారుల అధికారులు విస్తరణ పనులు చేపట్టారు.శ్రీకాళహస్తి నుంచి తిరుపతికి వెళ్ళే నేషనల్ హైవే పనులు అత్యంత వేగంగా చేస్తున్నారు. మరో నెలలో ఈ జాతీయ రహదారిని నాయకులు ప్రారంభించుటకు సన్నాహాలు జరుగుతున్నాయి. అయితే ఇందులో భాగంగా జాతీయ రహదారుల పని అక్కడక్కడ ప్రశ్నార్థకంగా మారింది.రాష్ట్ర నలుమూలల నుంచి అనేక మంది ప్రయాణికులు వేలాది మంది భక్తులు శ్రీకాళహస్తికి వస్తుంటారు.అయితే తిరుగు ప్రయాణంలో శ్రీకాళహస్తి నుంచి తిరుపతికి వెళ్ళే దారిలో హైవేకి అనుకుని తొండమనాడు సర్కిల్ వద్ద డివైడర్‌ను ఎటూ కాకుండా నిర్మాణాలు చేపట్టారు.కొంత మంది బయటి నుంచి వచ్చే ప్రయాణికులకు ఈ మార్గం గుండా దారి తెలియక తికమకపడుతున్నారు.ఇక్కడ ఓ సూచిక బోర్డు కూడా అధికారులు ఏర్పాటు చేయలేదు.హైవేకి అనుకుని ఉన్న ఈ డివైడర్‌తో వాహన దారులు అష్టకష్టాలు పడి వాహనాలను హైవే పైకిమళ్ళించాల్సిన దుస్థితి ఏర్పడింది.హైవేకి ఎడమ ప్రక్కన్న పూతలపట్టు హైవే నుంచి వివిధ మార్గాల్లో వచ్చే వాహనాలకు మాత్రం సూచిక బోర్డు ఏర్పాటు చేసి వాహనాలను కాళహస్తిలో వచ్చేందుకు ఏర్పాట్లను పూర్తి చేశారు.శ్రీకాళహస్తి నుంచి తిరు పతికి వెళ్ళే వాహనాలకు మాత్రం ఈ రూట్ క్లియరెన్స ఎందుకు ఇవ్వలేదన్నది ప్రశ్నార్ధకంగా ఉంది.కొన్ని ఆర్టిసి సర్వీసులు ఇసుకగుంట మీదుగా నేరుగా వెళ్ళి హైవే పై ప్రయాణిస్తున్నాయి.అలాంటి సమయాల్లో వెనుక నుంచి వాహనాల వల్ల ప్రమాదాలు సంభవించవచ్చు.ప్రమాదాలు సంభవించకముందే కాంట్రాక్టర్ సంబందిత అధికారులు స్పందించి జాతీయ రహదారులు సమస్య పై దష్టి సారించాల్సిన అవసరం ఎంతైన ఉంది.

## కైకాల విద్యార్థులకు అనారోగ్యంకు గురైన వారికి రూ.5లక్షలు పంపిణి

తొట్టంబేడు, జనవరి 19 ప్రభాతవార్త



నిరుపేద కైకాల విద్యార్థులకు అనారోగ్యంకు గురైన వారికి రూ.5లక్షలు పంపిణి చేశారు. శ్రీభ్రమరాంబ మల్లికార్జున కరికాలభక్త(కైకాల, కైకోలస్) అన్నదాన సత్రం లో 2024-25గాను తిరుపతి జిల్లా, అన్నమయ్య జిల్లా, ఒంగోలు జిల్లాలకు చెందిన పేద కులాలకు చెందిన విద్యార్థులకు మరియు అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు రూ.5లక్షలు చెక్కులను కామాడి లక్ష్మణరావు నేతృత్వంలోని యాజమాన్య కమిటీ మరియు సంక్షేమ కమిటీ శ్రీశైలం ఆధ్వర్యంలో మరియు సంక్షేమ కమిటీ శ్రీశైలం ఆధ్వర్యంలో శ్రీకాళహస్తీశ్వర సూళ్ళూరు ఈశ్వరయ్య సభాధ్యక్షతన కులపెద్దల సమక్షంలో చెక్కులు పంపిణీచేవారు. కార్యక్రమంలో శ్రీశైలసత్రం వ్యవస్థాపక అధ్యక్షులు పాలాటి బాలయోగి, ఎ.ఐ.డబ్యూ రాష్ట్ర అధ్యక్షుడు ఇనమాల శివరాం ప్రసాద్, కైకాల సత్రం కోశాధికారి కట్టాచక్రపాణి, సత్రం ఉపాధ్యక్షులు కట్టా సుధాకర్, సత్రం మాజీ అధ్యక్షులు ఒబ్బుమధు, ఐడబ్యుఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు కైలసాని సాయికుమార్, శ్రీశైల సత్ర ట్రస్టు సభ్యులు సంగీతం చంద్రశేఖర్, ఎఐడబ్యు ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కొడిపల్లిరాజ, ఒబ్బు వెంకటరత్నం, సూళ్ళూరు హరనాథ్, కైలసాని శివసుబ్రమణ్యం, మారాబత్తిని మునిశేఖర్, మరియు కులపెద్దలు పాల్గొన్నారు.

## హోంశాఖ మంత్రిని కలసిన గుడ్లూరు మయూర్

తొట్టంబేడు, జనవరి 19 ప్రభాతవార్త



కేంద్రహోంశాఖ మంత్రి అమిత్‌షాను ఎంజిఎం గ్రూప్‌డ రెక్టర్ గుడ్లూరు మయూర్ రాష్ట్రానికి విచ్చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాని మరియు రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడును విజయవాడలోని ఓ ప్రైవేటు హోటల్‌లో మర్యాదపూర్వకంగా కలసి శ్రీకాళహస్తీశ్వరస్వామి ప్రసాదాలు అందించి మహాశివరాత్రి ఉత్సవాలకు రావాల్సిందిగా ఆహ్వానించారు. ఈసందర్భంలో కేంద్ర మంత్రులు అయిన కింజారపు రామ్మోహన్‌నాయుడు మరియు బండి సంజయ్‌ని మర్యాదపూర్వకంగా కలసి శ్రీకాళహస్తికి ఆహ్వానించారు. శ్రీకాళహస్తికి వచ్చినపుడు ఎంజిఎం హాస్పిటల్‌ని మరియు ఎంజిఎం విద్యాసంస్థలను సందర్శిస్తామని తెలియజేశారు.

## గాదెలు నిండలేదు..పంట చేతికి రాలేదు..

తొట్టంబేడు, జనవరి 19 ప్రభాతవార్త



ప్రతి ఏడాది సంక్రాంతికి ఇంట్లో ఉన్న గాదెలు వరిపంటతో నిండితేనే సంక్రాంతి పండుగ జరుగుతుందని ఆనవాయితీ. అయితే ఈఏడాది పెన్‌గాన్‌తుఫాను ప్రభావంవల్ల పంటలు చేతికి రాలేదు. మరికొందరు ఆలస్యంగా పంటలు వేసిన వారికి ఎలాంటి ఇబ్బందులు లేదు. అయితే వర్షానికి ముందు పంటలు వేసిన వారికి ప్రస్తుతం వరికోతలకు ఆలస్యమవుతోంది. వరిపంటలో ప్రస్తుతం ఉన్న మంచువల్ల తెగుళ్ళుసోకుతుండడంతో అన్నదాతలు యూరియా కోసం బస్తాల కోసం మండలంలోని రైతు భరోసా కేంద్రాల వద్ద నిల్చోవాల్సి వస్తోంది. శ్రీకాళహస్తి తూర్పు ప్రాంతం అవడంతో ఎక్కువగా వ్యవసాయం ఇక్కడే చేస్తారు. ఓవైపు వర్షాలరాక, మరోవైపు తొట్టంబేడు మండలం నుంచి పిచ్చాటూరు వరకు తెలుగుగంగనీటితో చెరువులను నింపి వ్యవసాయం చేసుకోగా మరోవైపు బావులు వద్ద వరిపైరు నాట్లు నాటారు. శ్రీకాళహస్తి డివిజన్ పరిధిలోని శ్రీకాళహస్తి, తొట్టంబేడు, రూరల్, ఏర్పేడు, బుచ్చినాయుడుకండ్రిగ, కెవిబిపురం మండలాల్లో అన్ని పంటలు కలిపి 21,720 హెక్టార్లలో వరి, వేరుశనగ, ఇతర పంటలు వేసి ఉన్నారు. యూరియా, కాంప్లెక్స్ ఎరువులను ఎక్కువ వేయరాదని ప్రకృతి వ్యవసాయ పంటలతోనే శ్రేయస్కరమని ఎడిఏ రమేష్‌రెడ్డి తెలిపారు. ప్రతి ఏడాది పంటలు చేతికొచ్చే సరికి అన్నదాతలు ఆనందంగా సంక్రాంతి పండుగను నిర్వహించుకుంటారు. అయితే ఈఏడాది సంక్రాంతికి పంటలు చేతికి రాకపోయినా గ్రామాల్లో వేడుకలను మాత్రం సంతోషంగా చేసుకున్నారు.

## అమిత్‌షా గో బ్యాక్ గో బ్యాక్.. వామపక్ష పార్టీల నిరసన

పుత్తూరురూరల్, జనవరి 19 ప్రభాతవార్త:

రాష్ట్రవ్యాప్తంగా వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను పార్లమెంట్‌లో అవమానపరచిన అమిత్‌షా రాష్ట్ర పర్యటనలో భాగంగా వస్తున్న సందర్భంగా అమిత్‌షా గో బ్యాక్ కార్యక్రమం పుత్తూరు అంబేడ్కర్ సర్కిల్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వామపక్షాలు మాట్లాడుతూ పార్లమెంట్‌లో అమిత్‌షా అంబేడ్కర్ అవమానించారని మేము ఎన్నిసార్లు అయినా అంబేడ్కర్ అని అంటే జ్ఞానం పెరుగుతుందని అన్నారు. అంబేడ్కర్‌ని అవమానిస్తే ఏ రాజకీయ పార్టీ కూడా నోరు మెదపడం లేదని వాళ్ళ స్వాగతం పలుకుతున్నారని తెలిపారు. హోంమంత్రి నుంచి హంస రాజీనామా చేయాలని బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి మహేష్, కార్యదర్శి భాస్కర్, బీఎస్పీ పార్టీ ఇన్‌చార్జి ధనంజయలు, నాయకులు ముకుంద, చంద్రబాబు, దినేష్, బాబు, విజయ్, సుబ్రహ్మణ్యంపిళ్లై, రమేష్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఆలయాలు అభినందనీయం: చీకటి తొలగించండి

శ్రీకాళహస్తి,జనవరి 19 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయాధికారులు అతి పురాతనమై శిధిలావస్థకు చేరుకున్న పనస కోనలోని హరహరేశ్వరాలయాన్ని దేవేరి అన్నపూర్ణాదేవి ఆలయాన్ని కొత్తగా రూ.40లక్షలు వెచ్చించి ఏర్పాటు చేయటం అభినందనీయం అని పాలకుల ధార్మికతకు నిదర్శనం అని అయితే అక్కడ ప్రతి రోజూ వెళ్ళి దీపం వెలిగించటం కష్టసాధ్యమని కాబట్టి ఈ ఆలయంలోనూ, పరిసరాల్లో విద్యుత్ సదుపాయం కల్పించాలని హిందూధార్మిక మండలి పట్టణ కన్వీనర్ గరికపాటి రమేష్ కోరారు.కొత్త ఆలయం కుంబాభిషేకం కన్నుల పండువగా నిర్వహించారు. అయితే ఇక్కడ విద్యుత్ సదుపాయం లేక పొద్దుగుంకితే ఆలయాల్లో దేవుళ్ళు తప్ప వారిని పూజించుకునేందుకు భక్తులు వెళ్ళలేని పరిస్థితి అని వివరించారు. ఇక్కడ విద్యుత్ సదుపాయం,సెక్యూరిటి, నిత్యం పోలీసుల గస్తీ ఏర్పాటు చేయాలన్నారు. వెలుగులు కల్పిస్తే రాజీవ్‌నగర్,కైలాసగిరికాలనీ చుట్టుపక్కల పది గ్రామాల ప్రజలతో నిత్య పూజలతో హరహరేశ్వరుడు వెలుగొందుతారని రమేష్ ఆలయాధికారులను కోరారు.

## ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సు

శ్రీకాళహస్తిరూరల్ జనవరి 19 ప్రభాతవార్త



రహదారి భద్రత మాసోత్సవాలలో భాగంగా తిరుపతి జిల్లా రవాణా అధికారి మురళీమోహన్ శ్రీకాళహస్తి మోటార్ వాహన తనికి అధికారి దామోదార్‌నాయుడు ఆటో డ్రైవర్లకు రహదారి భద్రత పై అవగాహన కల్పించారు.ఏర్పేడు సమీపంలోని నూతన టోల్‌గేట్ వద్ద ఆటోలను తనిఖి చేశారు. ఈ క్రమంలో ఆటోలకు సంబందించి రికార్డులు సక్రమంగా ఉన్నాయ లేవా అని తనిఖిలు నిర్వహించారు.ఈ సందర్భంగా డిటిఓ మాట్లాడుతూ ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికుల తీసుకెళ్ళరాదని వాహనాలకు సంబందించిన రికార్డులు కలిగి ఉండాలని సూచించారు.కాళహస్తి వాహన మోటార్ అధికారి దామోదర్‌నాయుడు మాట్లాడుతూ వాహన పర్మిట్,ఆర్‌సి,ఎఫ్‌సి,ఇన్సూరెన్స్,డ్రైవింగ్ లెసెన్స్ కలిగి ఉండాలని జాతీయ రహదారులో అప్రవత్తతో వాహనాలను నడపాలని గ్రామాల నుంచి నూతనంగా జాతీయ రహదారులు కలిసే దగ్గర తగు జాగ్రత్తలు వహించాలన్నారు.ఈ జాతీయ రహదారి పై వాహనాలు అతివేగంగా వచ్చే అవకాశం ఉన్నందున ఎటువంటి పరిస్థితుల్లో వ్యతిరేక మార్గంలో ప్రయాణించరదన్నారు. ఎవరైన నియమ నిబందనలు ఉల్లంఘింస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

## మైనారిటీలను ఆశీర్వదించిన దేశం నాయకులు

శ్రీకాళహస్తి, జనవరి 19 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన మైనారిటి నాయకుడు రఫీ కుమార్తె వివాహం శాస్త్రోక్తంగా జామియా మస్‌జిద్‌లో జరిగింది. ఈ సందర్భంగా మౌలానా హాఫీజే ఖుర్ ఆన్ రేహాన్ వివాహ వ్యవస్థకు సంబంధించి వివరించారు. తెలుగుదేశం మైనారిటి అధ్యక్షుడు షఫీ అన్న కుమార్తె శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా తెలుగుదేశం నాయకులు పట్టణ అధ్యక్షుడు విజయకుమార్ నాయుడు, మాజీ మార్కెటింగ్ ఛైర్మెన్ రంగినేని చెంచయ్యనాయుడు క్లస్టర్ ఇన్‌చార్జి కంఠా రమేష్, మైనారిటి కార్యనిర్వాహాక కార్యదర్శి షాకీర్ అలి, ఖాదర్‌బాషా, బషీర్, ఖలీల్‌భాషా, ప్రవీణ్,ప్రవీణ్, మధుసూధన్‌రావు, మీర్జా,సాజిద్,మీర్జా, ముజీబ్ నయిం, అల్లాబక్ష తదితరులు హాజరై ఆశీర్వదించారు.

## విశాఖ ఉక్కు కర్మాగారానికి ప్రధాని ప్యాకేజీ ప్రకటించడం హర్షనీయం

తిరుపతి హెల్త్, జనవరి 19 ప్రభాతవార్త

వైజాగ్ స్టీల్ ఫ్లాంట్‌కు రూ. 11,440 కోట్ల ఫ్యాకేజీ ప్రకటించడం హర్షణీయమని ఏపీ రాష్ట్ర జనశక్తి విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు అళహరి సుధాకర్, రాష్ట్ర అధ్యక్షులు తోకల అశోక్‌కుమార్ సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర జనశక్తి విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులుతోకల అశోక్‌కుమార్‌మాట్లాడుతూవిశాఖఉక్కుకర్మాగారకార్మిక, ఉద్యోగుల పోరాటం ఫలించిందని కార్మిక, ఉద్యోగుల శ్రేయస్సు కోసం నిరంతరం ఏపీ రాష్ట్ర సీఎం నారా చంద్రబాబు నాయుడు, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని ఆయన తెలిపారు. ఈ రోజు వైజాగ్ స్టీల్ ఫ్లాంట్ ప్రైవేటీకరణ నిలుపుదలలో కీలకమైన ముఖ్యపాత్ర నిర్వహించి కేంద్ర నుంచి ఫ్యాకేజీ ఇప్పించిన జనసేన పార్టీ అధ్యక్షులు, డెప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు ఏపీ రాష్ట్ర జనశక్తి విద్యుత్ ఎంప్లాయిస్ తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. కార్మిక ఉద్యోగ శ్రేయస్సు కోసం ఏపీ రాష్ట్ర జనశక్తి విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ పాటుపడుతుందని గౌరవ అధ్యక్షులు అళహరి సుధాకర్ తెలిపారు. కేంద్ర భారీ పరిశ్రమలశాఖ మంత్రి హెచ్‌డీ కుమార స్వామి, కేంద్ర భారీ ఉక్కు పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ, కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహనాయుడుకి ఏపీ రాష్ట్ర జనశక్తి విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ తరపున అభినందనలు తెలిపారు.

# తిరుపతి డివిజన్

## కొన్నిగంటల్లో వైకుంఠమ్ 2క్యూలైన్లలోకి సామాన్యభక్తులు

–పెరిగిన భక్తులు

తిరుమల,జనవరి 19 ప్రభాతవార్తప్రతినిధి:



పదిరోజుల వైకుంఠద్వార దర్శనాలు ఆదివారం అర్ధరాత్రికి ముగియడంతో సోమవారం వేకువజాము నుండి సాధారణ సర్వదర్శనంలో భక్తులను ఆలయంలోనికి అనుమతిస్తున్నారు. ఆదివారం రాత్రి వరకు టిక్కెట్లు, టోకెన్ ఉన్న భక్తులనే దర్శనాలకు అనుమతించారు. వైకుంఠద్వారాలు మూసివేయడంతో నేడు ఒక్కరోజు సాధారణ దర్శనం కోసం ఆదివారం మధ్యాహ్నంకే తిరుమలకొండ భక్తులతో కిటకిటలాడుతోంది. సోమవారం నుండి సాధారణ సర్వదర్శనంలో భక్తులను అనుమతిస్తామని టిటిడి అధికారులు ముందుగానే ప్రకటించడంతో దేవుని దర్శనానికి నిరీక్షిస్తున్నారు. భక్తులకు నిరంతరాయంగా శ్రీవారిసేవకులుఅన్నప్రసాదాలు, టీ,పాలు,కాఫీ పంపిణీచేస్తున్నారు.

## హత్య కేసులో ముగ్గురు నిందితులకు యావజ్జీవ శిక్ష

కేవీబీ పురం, జనవరి 19 ప్రభాతవార్త:



కేవీబీ పురం పోలీస్‌స్టేషన్‌లో నమోదైన వివాహేతర సంబం ధం హత్యకు సంబంధించిన కేసులో ముగ్గురు వ్యక్తులకు యావజీవ కారాగార శిక్ష ఖరారైనట్లు కేవీబీ పురం ఎస్ఐ నరేష్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు... కేవీబీ పురం మండలంలోని మఠం గ్రామానికి చెందిన పల్లమాల కుప్పయ్య రెండో కోడలతో అదే గ్రామానికి చెందిన ఒకటో ముద్దాయి ఎన్.గంగరాజు అక్రమ సంబంధం కలిగి ఉండడంతో వారి ఇరువురిని కుప్పయ్య మందలిస్తున్నందున ఆయన అడ్డు తొలగించుకోవాలన్న నెపంతో 2017 డిసెంబరు 31 తేదీన పెరిందేశం గ్రామానికి చెందిన రెండో ముద్దాయి రాజా, మూడో ముద్దాయి ఏ.లోకేష్‌ల సహాయంతో మద్యం సేవించడానికి గ్రామ సమీపంలోని కర్మాగారం వద్దకు మృతుడు కుప్పయ్యను తీసుకొచ్చి అధిక మోతాదులో మద్యం తాగించి చెట్టు చాటున కుప్పయ్యను హతమార్చడానికి సిద్ధంగా ఉన్న ఒకటో నిందితుడు గంగరాజు అతి దారుణంగా తలపై కత్తితో నరికి హత్య చేసిన సంఘటనపై శ్రీకాళహస్తి 12వ అదనపు జడ్జి ఎం.శ్రీనివాసనాయక్, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సి.వీర రాఘవరెడ్డి వాదనలను ఏకీభవించి సదరు కేసులో నిందితులైన గంగరాజు, రాజా, లోకేష్‌లపై నేరం రుజువు కావడంతో యావజీవ శిక్ష విధించినట్లు ఆయన తెలిపారు. సంబంధిత కేసు నిరూపణకు సహకరించిన కేవీబీ పురం పోలీసులను నారాయణవనం సీఐ రవీంద్ర, పుత్తూరు డీఎస్పీ రవికుమార్‌లు అభినందించారు.

## ఎస్ఐని సన్మానించిన ముఖేష్‌రెడ్డి

కేవీబీ పురం, జనవరి 19 ప్రభాతవార్త:



కేవీబీ పురం నూతన ఎస్ఐ నరేష్‌ని అంజూరు గ్రామ టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ మలుగారి ముఖేష్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలసి శాలువతో సన్మానించారు. అనంతరం ఎస్ఐ అంజూరు గ్రామ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు ధనశేఖర్ తదితరులు ఉన్నారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

పుత్తూరురూరల్, జనవరి 19 ప్రభాతవార్త:

పుత్తూరు రూరల్ ఉత్తరపు కండ్రిగ సమీపంలోని తిరుపతి-చెన్నై జాతీయ రహదారిపై ఆదివారం వేకువ జామున 3 గంటల మధ్యలో నగరి నుంచి పుత్తూరు వైపుగా కాలినడకన నడిచి వెళ్లే ఓ వ్యక్తిని, వెనుక వైపు నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఆ వ్యక్తి నుజ్జు నుజ్జయి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, ప్రమాదాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అనంతరం పోలీసులు మాట్లాడుతూ స్థానికులు కథనం మేరకు... నగరి నుంచి పుత్తూరు వైపు గుర్తు తెలియని వ్యక్తి నడిచి వెళుతుండగా అదే వైపుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో రోడ్డుపై నుజ్జు నుజ్జయి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆ వ్యక్తికి గళ్ళ చొక్కా, బ్లూ గళ్ళ లుంగి ఉందని, పుత్తూరు పోలీసుశాఖ వారు ఓ ప్రకటనలో తెలిపారు. ఎవరికైనా సమాచారం తెలిస్తే పుత్తూరు సీఐ ఫోన్ నెం.9440736727, ఎస్ఐ ఫోన్ నెం.9440796728లకు సమాచారం తెలియజేయాలని తెలిపారు.

## సార్...నాకు పింఛన్ మంజూరు చేయండి

విజయపురం, జనవరి 19 ప్రభాతవార్త:



సార్ నాకు పింఛన్ మంజూరు చేయండంటూ మండలంలోని కమ్మకండ్రిగకు చెందిన 63 సంవత్సరాల వృద్ధురాలు, వితంతువు తులసి కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. నా భర్త రాధాకృష్ణ పింఛన్ పొందుతూ గత సంవత్సరం మృతి చెందాడని, అప్పటి నుంచి పింఛన్ కోసం ప్రతి ఆఫీసు మెట్టు ఎక్కినా ప్రయోజనం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. నా భర్తసెంటు భూమి లేని కల్లుగీత కార్మికుడని, నాకు ఒక కుమార్తె ఉందని, ఆమెను తమిళనాడు ఇచ్చి వివాహం చేశామని, వస్తున్న పింఛన్‌తో జీవనం సాగిస్తూ వస్తున్నామని, ఆయన చనిపోవడంతో పూరిగుడిసెలో ఒంటరిగా బిక్కు బిక్కుమంటూ కాలం గడుపుతున్నామని కంటతడి పెట్టింది. సంవత్సరం రోజులుగా తిరుగుతున్నా అధికారులు కనికరించడం లేదని వాపోతున్నారు. పింఛన్ తీసుకుంటూ మృతి చెందితే వెంటనే వారి కుటుంబ సభ్యులకు పింఛన్ మంజూరు చేయండని సీఎం చంద్రబాబు సూచనలు జారీ చేసినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇకనైనా అధికారులు కరుణించాలని ప్రాధేయపడుతున్నారు.

## సిద్దులుగారి మురళికి నివాళులు

శ్రీకాళహస్తి,జనవరి 19 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మాజీ కౌన్సిలర్ సిద్దులుగారి మురళి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతికి ఆదివారం సంతాపసభను వారి సోదరులు రిటైర్డ్ హౌసింగ్ అధికారి సిద్దులుగారి ప్రసాద్ ఏర్పాటు చేసారు.ఈ సభకు ముఖ్యఅతిధిగా మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి, శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి మాజీ ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 14వ వార్డు కౌన్సిలర్‌గా మురళి ఎంతో అభివృద్ది చేపట్టారన్నారు. వార్డు ప్రజలకు అందుబాటులో ఉంటూ పలు రోడ్లు, కాలువల నిర్మాణంలో కీలకంగా వ్యవహారించారన్నారు.అలాగే స్థానిక రిపబ్లిక్‌క్లబ్ అధ్యక్షులుగా పదవులనలంకరించి సేవలందించారన్నారు. రాజకీయ నాయకుడుగా వ్యాపారిగా మురళి రాణించారన్నారు.ఈ కార్యక్రమంలో పఠాన్ ఫరీద్‌ఖాన్,సురేష్,శివప్రసాద్‌లు పాల్గొన్నారు.

# తిరుపతిలో సంక్రాంతికి వస్తున్నాం చిత్ర బృందం సందడి

తిరుపతి హెల్త్, జనవరి 19 ప్రభాతవార్త ః

– జయశ్యామ్ థియేటర్‌లో ప్రేక్షకులతో ముచ్చట్లు
– కేక్ కట్ చేసి, టపాకాయలు పేల్చి సంబరాలు జరుపుకున్నఅభిమానులు



తిరుమల శ్రీవారి దర్శన అనంతరం తిరుపతిలో ఆదివారం మధ్యాహ్నం సంక్రాంతికి వస్తున్నాం చిత్ర బృందం సందడి చేసింది. చిత్ర నిర్మాత దిల్‌రాజా, డైరెక్టర్ అనిల్ రావిపూడి, హీరోయిన్లు మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేష్, నటులు శ్రీనివాసులురెడ్డి, బుల్‌రాజ్ (రేవంత్),మ్యూజిక్ డైరెక్టర్ బీమ్ తిరుపతిలోని జయశ్యామ్ థియేటర్ చేరుకుంటున్నారన్న విషయం తెలుసుకున్న అభిమానులు థియేటర్ వద్దకు చేరుకున్నారు. కేక్ కట్ చేసి టపాకాయలు పేల్చి సంబరాలు జరుపుకున్నారు. అంతకు ముందు చిత్ర యూనిట్ థియేటర్‌లో సినిమా చూస్తున్న ప్రేక్షకులు, అభిమానులతో వారి వారి అభిప్రాయాలను పంచుకున్నారు. చిత్రాన్ని ప్రేక్షకులు పెద్ద ఎత్తున ఆదరించి సక్సెస్ చేయడం ఎంతో సంతోషమన్నారు. తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామిని చిత్ర యూనిట్ దర్శించుకోవడం పూర్వ జన్మ సుకృతమన్నారు. సినీ హీరో రాలేక పోయారని, మీ అందరి ఆదరణ చూస్తుంటే ఈ సినిమా ప్రపంచ వ్యాప్తంగా మరింత ఆదరణ పొందుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతి సంక్రాంతికి సినీ హీరో వెంకటేష్‌తో దిల్‌రాజా సినిమా తీయడం,ఆ సినిమా సక్సెస్ కావడం సంతోషంగా ఉందని దిల్‌రాజా సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం ప్రముఖ నిర్మాత ఎన్వీ ప్రసాద్ మాట్లాడుతూ ఈ చిత్రం ప్రేక్షకుల, అభిమానుల ఆదరాభిమానులను పంచుకుందని, మరో 50 చిత్రాలు తీసి రికార్డు సృష్టించాలని సినీ హీరో వెంకటేష్, చిత్రయూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



## జాహ్నవిని అభినందించిన జేవీఎస్ పౌండేషన్



వెంకటగిరి, జనవరి 19 ప్రభాతవార్త : కేంద్రీయ విద్యాలయ లో పదవ తరగతి చదువుతున్న చిట్టత్తూరు జాహ్నవి చిత్రలేఖనంలో అత్యంత ప్రతిభ చాటుతూ రాష్ట్ర వ్యాప్తంగా వివిధ బహుమతులు అందుకుంటున్న ఈ చిన్నారిని వెంకటగిరి జేవిఎస్ ఫౌండేషన్ సంస్థ అభినందిం చారు. అధ్యక్షులు లక్కమనేని మురళీకృష్ణ ప్రత్యేక జ్ఞాపికతో ఆ బాలికను సత్కరించారు. ఇంకా ఉన్నత స్థాయికి విద్యార్థిని ఎదగాలని విశ్రాంతి ప్రధానోపాధ్యా యులు పొనుగోటి సుబ్రమణ్యం అభినందించారు.. ఈ కార్యక్రమంలో సభ్యులు లక్కమనేని కోటేశ్వరరావు, విశ్రాంత ఉపాధ్యాయులు శిరసనగండ్ల గంగాప్రసాద్, సుంకర రవికుమార్, ఉపాధ్యాయులు బారు సత్యనారాయణ, జాహ్నవి, గురువు రవికుమార్ (ఒంగోలు), తల్లి బీనారాణిగ తోట వాణి, కస్తూరమ్మ, రేవంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## నేలకొరిగిన వరి... రైతు కంట కన్నీరు!

దొరవారిసత్రం, జనవరి 19 ప్రభాతవార్త : దేశానికి వెన్నెముక రైతు, కాని దేశానికి అన్నంపెట్టే రైతు రాత్రి పగలు కష్టంచేసి ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని అప్పుచేసి వరిపైరు సాగుచేస్తే, కోతదశలో అకాల వర్షానికి నేలకొరగడంతో రైతుకి మిగిల్చిన కన్నీరు. తిరుపతి జిల్లా దొరవారిసత్రం మండల పరిధిలో శనివారం రాత్రి కురిసిన అకాల వర్షానికి కోతదశలో ఉన్న వరి పైరు నేలకొరిగింది. మూడు నెలలపాటు రైతు అప్పుచేసి వరిపైరు సాగుచేసి దాన్యం చేతికందే దశలో వర్షం కురవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.తక్షణం ప్రభుత్వం అధికారులను ఆదేశించి పంట నష్టాన్ని అంచనావేసి, నష్టపోయిన రైతులను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

## అధికారులు మాట తప్పడంతో...ప్రజలకు అవస్థలు

కోట, జనవరి 19 ప్రభాతవార్త : రోడ్లపై గుంతలు పూడ్చడంలో ఆర్అండ్‌బి శాఖ లక్ష్యాన్ని చేరుకోలేకపోయింది. గత వైసీపీ ప్రభుత్వం రహదారులపై నిర్లక్ష్యం చూపింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సంక్రాంతిలోగా గుంతలు లేని రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుడతామని చెప్పారు. కానీ కోట మండలంలో ఆ దిశగా ఎక్కడా కూడా రోడ్ల నిర్మాణాను పూర్తి చేయలేకపోయారు. గుంతలు పూడ్చే విషయంలో అధికారులకు ఆటంకాలు ఏర్పడ్డాయని చెప్పుకుంటున్నారు.

కోట మండలం విద్యానగర్ నుంచి నాయుడుపేట వరకు, కోట నుంచి కొత్తపట్నం వరకు, ఉత్తమనెల్లూరు నుంచి కర్లపూడి వరకు, ఉత్తమనెల్లూరు నుంచి దొరువుకట్ట గ్రామాల్లో రోడ్ల పరిస్థితి దయనీయంగా ఉంది. అయితే డిసెంబర్ 30 వరకు వరుసగా తుపాన్లు వెంటాడటంతో వర్షాలు కురుస్తుండటంతో పనులు ప్రారంభించలేదని ఆర్అండ్‌బి అధికారులు చెప్పుకొచ్చారు.

## కాలేజి గ్రౌండ్స్‌లో కోలాహలం





సూళ్లూరుపేట, జనవరి 19 ప్రభాతవార్త : సూళ్లూరుపేట కేంద్రంగా నిర్వహిస్తున్న ఫ్లెమింగో ఫెస్టివల్‌లో రెండవ రోజు ఆదివారం కాలేజి గ్రౌండ్స్‌లో జనసమూహం, విద్యార్థుల తాకిడిగా కోలాహల ంగా మారింది. ఉదయం 9 గంటల నుంచే విద్యార్థులు, సందర్శకుల తాకిడితో కాలేజిగ్రౌండ్స్ నిండిపోయింది. శనివారం రాత్రి వర్షం కురిసి గ్రౌండ్ మొత్తం జలమయం అయింది. అయినప్పటికీ జనం ఆ బురదలోనే ఎగ్జిబిషన్ స్టాల్స్‌ను తిలకించేందుకు క్యూకట్టారు. కొన్ని స్టాల్స్‌లోకి వర్షపు నీరు చేరిపోవడంతో ఆ నీటిని తొలగించేం దుకు మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య యుద్ధప్రాతిపదికన మోటార్ల ద్వారా చర్యలు చేపట్టారు. అనంతరం ఇసుక, గ్రావెల్ డస్ట్ తీసుకొచ్చి సాయం త్రం 6 గంటల వరకు ఎక్కడ వర్షపు నీరు నిలిచి ఉందో అక్కడ చల్లి చదును చేయించారు. జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ కాలేజి గ్రౌండ్స్‌కు చేరుకొని సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షించేందుకు వీలుగా వర్షపు నీరు ఉన్న చోటల్లా శుభ్రం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ కాలేజి గ్రౌండ్స్‌ను పరిశీలించారు. ఒకవైపు జనం కోలాహలం, మరోవైపు అధికారుల హడావుడితో కాలేజి గ్రౌండ్స్‌లో ఎన్నడూ లేనివిధంగా వింత శబ్దాలతో దద్దరిల్లిపో యింది. అటకానితిప్పలో ఆదివారం పక్షులను చూసేందుకు విద్యార్థులు, సందర్శకులు పెద్దఎత్తున తరలి వచ్చారు. సూళ్లూరుపేట నుంచి శ్రీహరికోటకు వెళ్లే మార్గంలోని వాచ్ టవర్స్‌లో పక్షులను బైనాకులర్ల ద్వారా తిలకించారు. సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మంచినీరు, ఇతర మౌలిక సదుపాయాలను జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాటు చేసింది. డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## ఫ్లెమింగో సందర్శకులకు అడుగడుగునా ట్రాఫిక్ జామ్

**- నియంత్రణలో పోలీసు వైఫల్యం**



సూళ్లూరుపేట, జనవరి 19 ప్రభాతవార్త: ఫ్లెమింగో ఫెస్టివల్ రెండోరోజున ఆదివారం వేడుకలను తిలకించేందుకు సూళ్లూరుపేట కాలేజి గ్రౌండ్స్‌కు తరలి వచ్చిన భారీ జన సందోహానికి అడుగడుగునా ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురయ్యాయి. బస్టాండు వద్ద నుంచి కాలేజి మైదానానికి వెళ్లేందుకు అర్థగంట సమయం తీసుకోవాల్సి వచ్చింది. పోలీసులు ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకున్నా.. అవి అంతంతమాత్రంగానే ఉండటంతో ఒకవైపు ఆటోలు, మరోవైపు కార్లు యథేచ్ఛగా రద్దీ ప్రాంతంలోకి రావడంతో సందర్శకులకు ట్రాఫిక్ కష్టాలు తప్పలేదు. పోలీసులు ట్రాఫిక్ నియంత్రణలో అంతంత మాత్రంగానే వ్యవహరిం చారన్న విమర్శలు గుప్పుమన్నాయి. ట్రాఫిక్ నియంత్రణకు ముందుగానే అంచనావేసి ఎక్కడికక్కడ చర్యలు చేపట్టాల్సిన పోలీసు యంత్రాంగం పూర్తిగా దృష్టి సారించినట్లు కనిపించలేదు. కనీసం పాదచారులు కూడా కాలేజి మైదానానికి వెళ్లేందుకు ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం 5 గంటల వరకు నియంత్రణ బాగానే ఉన్నప్పటికీ తర్వాత సమస్య మొదలయింది. పోలీసులు ప్రేక్షకపాత్ర వహించడంతో ఈ కష్టాలు తప్పలేదు. దీనిపై సందర్శకులు నిరాశ వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఇటీవల జరిగిన అధికారుల సమీక్ష సమావేశంలో ముందుగా జిఎన్‌టిరోడ్లపై ఆక్రమణలు తొలగించి తర్వాత పండుగ పనులు చేపట్టాలని ఆదేశించారు. కానీ ఇవేమీ పట్టించుకోకుండానే అధికార యంత్రాంగం పండుగ వేడుకలకు సిద్ధం కావడంతో ఎక్కడపడితే అక్కడ జిఎన్‌టి రోడ్డుపై ఇష్టాను రీతిన అంగళ్లు, ఇతర చిరు వ్యాపారులు ఆక్రమించుకోవడంతో ఈ పరిస్థితి దాపురించింది. ఇంత పెద్ద ఫెస్టివల్ జరుగుతున్నప్పుడు ప్రణాళిక లేకుండా పోలీసులు వ్యవహరించడం పట్ల పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## ఫ్లెమింగో ఫెస్టివల్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు





సూళ్లూరుపేట, జనవరి 19 ప్రభాతవార్త : ఫ్లెమింగో ఫెస్టివల్‌లో రెండవ రోజున ఆదివారం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. సాయంత్రం నుంచి స్థానిక కళాకారులచే సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఒకవైపు కబడ్డీ, వాలీబాల్, టెన్నికాయిట్ పోటీలు జరుగుతుండగా, మరోవైపు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వీటిని తిలకించేందుకు సందర్శకులు భారీగా తరలివచ్చారు. ప్రముఖ సినీ కళాకారిణి అనసూయ ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వీరితో పాటు ప్రముఖ గాయకులు రఘు కుంచె, రఘురామ్, శ్రీనివాస్, శృతి, గాయత్రి, తేజస్విని, సాయి వాగ్దేవి తదితర కళాకారులు ఫ్లెమింగో ఫెస్టివల్ సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రదర్శనలిచ్చారు. అషరెడ్డి, యాంకర్ రేణు అలరించారు. మిమిక్రీ కళాకారుడు షరీఫ్ తన మిమిక్రి కళతో సందర్శకులను ఉర్రూతలూగించారు. హైదరాబాద్‌కు చెందిన సత్య డాన్స్ మాస్టర్ ఆధ్వర్యంలో పలువురు సినీ సాంప్రదాయ నృత్యాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్, మాజీ ఎంఎల్‌సి వాకాటి నారాయణరెడ్డి, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

## 20 నుంచి ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు

కోట, జనవరి 19 ప్రభాతవార్త : ఈ నెల 20 నుంచి 31వ తేదీ వరకు కోట మండలంలో ఉచిత పశు ఆరోగ్య వైద్యశిబిరాలు నిర్వహించనున్నట్లు విద్యానగర్‌లోని పశు వైద్యాధికారి డాక్టర్ రాజేష్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈ శిబిరాల్లో పశువైద్యం, గర్భకోశ వ్యాధులకు చికిత్స, వ్యాధి నిరోధక టీకాలు, నట్టల నివారణ మందులు పంపిణీ, వ్యాధి నిర్ధారణ పరీక్షలు, శాస్త్రీయ యాజమాన్యంపై అవగాహన సదస్సులు ఉంటాయన్నారు. రోజుకు మండలంలో రెండు గ్రామాల్లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. తమ వెంట పారా, వెటర్నరీ సిబ్బంది, గోపాలమిత్ర, పశు సంవర్ధక సహాయకులు ఉంటారని పేర్కొన్నారు. మండలంలో మూడు వేల ఆవులు, మూడువేల గేదెలు, 28 వేల గొర్రెలు, మేకలు ఉన్నాయని పేర్కొన్నారు.

## సందర్శకులకు ఉచిత బస్సు సౌకర్యం




సూళ్లూరుపేట, జనవరి 19 ప్రభాతవార్త : ఫ్లెమింగో ఫెస్టివల్‌కు వచ్చే సందర్శకులకు జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఆదేశాల మేరకు ఆది, సోమవారాల్లో ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించారు. స్థానికంగా ఉన్న కాలేజి గ్రౌండ్స్, ఆర్టీసీ బస్టాండు వద్ద నుంచి ఈ బస్సులు అటకానితిప్ప, నేలపట్టు, బివిపాలెం ప్రాంతా లకు వెళ్లే విధంగా ఏర్పాటు చేశారు. సందర్శ కులతో పాటు విద్యార్థులు ఈ బస్సుల్లో ఎక్కి నేలపట్టు, అటకానితిప్ప, బివిపాలెం ప్రాంతాలకు తరలి వెళ్లారు. సుదూర ప్రాంతాల నుంచి సందర్శకుల తాకిడి రెండవరోజు బాగా ఎక్కువయింది.

## క్రికెట్ పోటీల్లో విజేతగా నిలిచిన పల్లిపాడు జట్టు



బాలాయపల్లి, జనవరి 19 ప్రభాతవార్త : మండలం పల్లిపాడు గ్రామంలో ఈ నెల 9వ తేది గరుడ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహి ంచిన క్రికెట్ టోర్నమెంట్ శనివారంతో ముగిసింది. ఈ టోర్నమెంట్‌లో పల్లెపాడు టీమ్ విజేతలుగా నిలిచారు. చెన్నూరు యూత్ ద్వితీయ స్థానంలో నిలిచారు. గరుడ ఫౌండేషన్ కో పౌండర్, వెంకటగిరి నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షులు గెరిటి చెంచయ్యయాదవ్ విన్నర్స్‌కి రు.12,516, రన్నర్స్‌కు రు.6,016 బహుకరించారు. అనంతరం విన్నర్స్‌కు వైస్ ఎంపిపి మురళిరెడ్డి చేతుల మీదుగా, రన్నర్స్‌కు కప్పులను తోట రామచంద్రయ్య చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా బాలాయపల్లి వైస్ ఎంపిపి మురళిరెడ్డి, వెంకటగిరి రూరల్ తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షులు తోట రామచంద్రయ్య మొదలియార్, నియోజకవర్గ తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి చెంచుమనోహర్, మణియాదవ్ పాల్గొని అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమం నిర్వాహకులు శివ, చరణ్, రఫీ, కిషోర్, తిరణం అశోక్, యువత పాల్గొన్నారు.

## సామాన్యుడిపై కక్ష సాధింపు చర్యలా

**- పదే పదే కేసులకు తహాశీల్దార్ సిఫార్సులు - ఆరోపణలు వ్యక్తం చేస్తున్న గ్రామస్థులు**



చిట్టమూరు, జనవరి 19 ప్రభాతవార్త: రెవెన్యూ పరిధిలోని ఆక్రమిత భూములపై తహాశీల్దార్ వ్యవహరిస్తున్న తీరు పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చిట్టమూరు మండల పరిధిలోని తీరప్రాంత గ్రామాలైన బురదగాలి కొత్తపాలెంలో వందలాది ఎకరాలు అటవీ భూములతో పాటు ఉప్పుటేరు భూములు ఆక్రమణకు గురయినా పట్టించుకోదని అంటు న్నారు. రెవెన్యూ అధికారులు కేవలం వైసీపీ సానుభూతిపరుడైన తండ్రీ కొడుకులపై పదే పదే కేసుల నమోదుకు పోలీసులకు సిఫార్సులు చేయడం వెనుక కూటమి నేతల హస్తం ఉందన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. సర్వే నంబర్ 2లో గ్రామానికి చెందిన దువ్వూరు గిరిరెడ్డి మూడు ఎకరాల 50 సెంట్లు భూమిని గత 20 సంవత్సరాలుగా సాగు చేసుకుంటూ బ్రతుకు జీవనం వెళ్లదీస్తున్నారు. అలాగే ఇదే సర్వే నంబర్‌లోని ఉప్పుటేరు భూమి వెయ్యి ఎకరాల్లో గ్రామానికి చెందిన ఎంతోమంది ఆక్రమించి సాగు చేసుకుంటున్నా, తహాశీల్దార్ మాత్రం కేవలం గిరిరెడ్డినే లక్ష్యంగా చేసుకుంటూ గత రెండు నెలలుగా వేధింపులకు గురిచేసే చర్యలు చేపట్టడం పట్ల బాధితులు కన్నీరు మున్నీరవుతున్నారు.

## కృప సేవా చారిటబుల్ ట్రస్ట్‌చే దుప్పట్లు పంపిణీ



గూడూరు, జనవరి 19 ప్రభాతవార్త: చిల్లకూరు మండలం కోట క్రాస్ రోడ్ వద్ద ఉన్న నక్కల వారి కండ్రిగలో ఆదివారం కృపసేవా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరుపేదలైన గిరిజనలు కుటుంబాలకు దాతగా వ్యవహరించిన షేక్ భాషా, షేక్ బషీర దంప తుల, కుటుంబ సభ్యుల పూర్తి సహాయ సహ కారాలతో కృప సేవా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కృప సేవా చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు కటకం శ్రీని వాసులు మాట్లాడుతూ మానవ సేవలోనే మాధవ సేవ దాగుందని, ప్రతి ఒక్కరు పరుల సేవకు పాటు పడాలన్నారు. దాతగా వ్యవహరించిన షేక్ భాషా, షేక్ బషీర దంపతుల, వారి కుటుంబ సభ్యులకు కృపసేవా చారిటబుల్ ట్రస్ట్ తరపున ధన్యవాదాలు తెలియజేశారు.మంజరి గోపాల్, పర్వతాల రమేష్, పేయ్యల రమణయ్య, పల్లం గురవయ్య, తుమ్మ తోటి శంకరయ్య, పెరిమిటి చెంచయ్య గోను ఈశ్వరయ్య, చవల సురేంద్ర బాబు, మినీ అంగన్వాడి టీచర్ తిరుమలశెట్టి మౌనికలు పాల్గొన్నారు.

## రోడ్డుప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

నాయుడుపేట,జనవరి 19 ప్రభాతవార్త : నాయుడుపేట మండలంలోని మేనకూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. నాయుడుపేటకు చెందిన కిషోర్, రాజుకుమార్‌లు మోటార్ సైకిల్‌పై మేనకూరు సమీపంలో ఉన్న కంపెనీకి వెళ్ళి డ్యూటి ముగించుకొని, తిరిగి నాయుడుపేటకు వస్తుండగా మార్గ మధ్యలో మేనకూరు వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి ప్రమాదవశాత్తు మోటార్‌సైకిల్ అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో మోటార్‌సైకిల్‌పై ప్రయా ణిస్తున్న కిషోర్, రాజుకుమార్‌లు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు గుర్తించి క్షతగాత్రులను 108 సహాయ ంతో చికిత్స నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. నాయుడుపేట పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కోడిపందేల స్థావరాలపై పోలీసుల దాడులు



కోట, జనవరి 19 ప్రభాతవార్త : కోట మండలం దొరువుకట్ట గ్రామ శివారుల్లో ఆదివారం కోడిపందేలు నిర్వహిస్తున్న స్థావరంపై కోట ఎస్ఐ పవన్‌కుమార్, వాకాడు ఎస్ఐ నాగబాబు, పోలీసు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. పదిమంది వ్యక్తులతో పాటు, 10 కోళ్లను, 10 వేల రూపాయలు నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు. మండలంలో ఎక్కడయినా బెట్టింగులు, కోడిపందేలు, జూదం, పేకాట ఆడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## కుంభ వృష్టి వర్షంతో తప్పని తిప్పలు



విజయపురం, జనవరి 19 ప్రభాతవార్త: మండలంలోని శనివారం రాత్రి, ఆదివారం ఉదయం కుంభ వృష్టి వర్షం కురిసింది. ఎక్కువగా వర్షం కురవడంతో మళ్లీ చెరువులన్నీ నిండుకుండలా మారింది. మండలంలోని పాతార్కాడు, మంగళం, శ్రీహరిపురం, మహావీరాపురం, పన్నూరు చెరువులు మొరవ పారాయి. మండలంలోని ఇళ్ళత్తూరు వద్ద చెరువు వరవ కాలువ ఆక్రమణకు గురి కావడంతో వరద ఉధృతి నీరు ఇళ్ళత్తూరు-చివ్వాడ రోడ్డుపై పారడంతో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. ఈ విషయమై అధికారులు పట్టించుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. కమ్మకండ్రిగలో నూర్పిడికి సిద్ధంగా ఉన్న వరిపంట నేలకొరిగిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

## రహదారు నిర్మాణం, మరమ్మతులకు అధిక ప్రాధాన్యత

**- ఆంధ్రా సరిహద్దు వరకు రోడ్డు నిర్మాణానికి కలెక్టర్, ఎమ్మెల్యేలు భూమిపూజ**



గుడిపాల, జనవరి 19 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం రోడ్ల నిర్మాణాలకు, రోడ్ల మరమ్మతు లకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మో హన్‌నాయుడులు పేర్కొన్నారు. గుడిపాల మండల పరిధిలోని చిత్తూరు- వేలూరు రోడ్డులో చెన్నై క్రాస్ జంక్షన్ నుండి ఆంధ్ర సరిహద్దు వరకు జరిగే రోడ్డు నిర్మాణ పనులకు ఆదివారం కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడులు కలిసి భూమి పూజ చేశారు. చిత్తూరు-వేలూరు రోడ్డులో వైజంక్షన్ నుండి ఆంధ్ర సరిహద్దు వరకు రోడ్డు గుంతలమయమై వాహనదారులకు తీవ్ర ఇబ్బందిగా మారడంతో ఇటీవల కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడులు సంయుక్తంగా కలిసి రోడ్డును పరిశీలించారు. ఈ మేరకు రోడ్డు అభివృద్ధికి సత్వరం చర్యలు చేపట్టాలని ఆర్అండ్‌బి అధికా రులను వీరు ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ వేలూరు రోడ్డులో వైజంక్షన్ నుండి ఆంధ్ర సరిహద్దు వరకు 1.6 కిమీ మేర పొడవైన రోడ్డును పూర్తి స్థాయిలో మరమ్మత్తులు చేపట్టడానికి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.2.30 కోట్ల నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు మాట్లాడుతూ సిఎం నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రహదారుల అభివృద్ధి, మరమ్మత్తులకు అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి రహదారుల అభివృద్ధి పనులు ఊపందుకున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఎస్ఇ చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్అండ్‌బి ఇఇ శ్రీనివాసులు, డిఇ దస్తగిరి, తహసిల్దారు చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపిడిఓ శివరాజ్, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గుడిపాల మండల తెలుగుదేశం అధ్యక్షులు సుబ్రమణ్యంనాయుడు, మాజీ ఎమ్మెల్యే ఆర్.గాంధీ, నాయకులు బాలాజీ నాయుడు, అనిల్‌కుమార్, హరిప్రసాద్, రవినాయుడు, గోవిందగౌడ్, గోపి, ఇతర తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## శ్రీవారి చెంత 'సంక్రాంతికి వస్తున్నాం టీమ్ సందడి



తిరుమల.జనవరి 19ప్రభాతవార్తప్రతినిధి: సక్రాంతి పండుగకు విడుదలైన "సంక్రాంతికి వస్తున్నాం" చిత్రం విజయవంతమైందని చిత్రనిర్మాత,దర్శకుడు అనిల్‌రావిపూడి, దిల్‌రాజు తెలిపారు. ఈ చిత్రం బృందం మీనాక్షిచౌదరి, ఐశ్వర్యరాజేష్, అనిల్ రావిపూడి, దిల్‌రాజు, బులిరాజురేవంత్, శ్రీనివాసులు రెడ్డి శ్రీవారిని దర్శించుకున్నారు.

## 22.96 కోట్లతో కుప్పంలో ప్రసిద్ధ ఆలయాల పునర్నిర్మాణాలు

**- ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్**
**- ఆలయాలు పరిశీలించిన దేవదాయ శాఖ ఉన్నతాధికారులు !!**



కుప్పం,జనవరి 19 ప్రభాతవార్త : సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో కుప్పం నియోజకవర్గంలో దాదాపు 22.96 కోట్లతో ప్రసిద్ధ ఆలయాల పునర్నిర్మాణాలకు దేవదాయశాఖ అధికారులు చర్యలు చేపట్టినట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. ఆదివారం ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, దేవదాయ శాఖ చీఫ్ ఇంజనీర్ శేఖర్, ఎస్ఇ గంగయ్య, డిఇ జనార్ధన్, అసిస్టెంట్ కమీషనర్ చిట్టెమ్మ తదితరులు కుప్పం శ్రీ తిరుపతి గ ంగమ్మ ఆలయం, బేటరాయస్వామి కొండ ఆలయం, గుడుపల్లె మల్లప్ప కొండ ఆలయాలను పరిశీలించారు. ఈసందర్భంగా ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ కుప్పం శ్రీ తిరుపతి గంగమ్మ ఆలయంకు 8.70కోట్లు, శ్రీ బేటరాయస్వామి ఆలయంకు 2.66 కోట్లు, గుడుపల్లె మల్లప్పకొండకు 3.80కోట్లు, రాళ్లబూదుగూరు శ్రీ కోదండరామాల యంకు 7.80 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ఈ నిధులతో ఆలయాలను పునర్నిర్మిం చడంతో పాటు భక్తులకు అవసరమైన వసతులు కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమాల్లో కన్వీనర్ ఆర్.చంద్రశేఖర్, ఎఇ ఆనంద్, ఇఇ చలపతి, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, మండల పార్టీ అధ్యక్షులు ప్రేమ్‌కుమార్, బాబునాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జ్ ప్రతాప్, స్థానిక నేతలు పాల్గొన్నారు.

**శాంతిపురం :** మండలంలోని రాళ్లబూదుగూరులోని పురాతన శ్రీ కోదండరామాలయాన్ని ఆదివారం ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, దేవదాయ శాఖ చీఫ్ ఇంజనీర్ శేఖర్, ఎస్ఇ గంగయ్య పరిశీలించారు. ఈసందర్భంగా ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ రాళ్లబూదుగూరు ఆలయాన్ని ఏడుకోట్ల ఎనభై లక్షలతో అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డిఇ జనార్ధన్, అసిస్టెంట్ కమీషనర్ చిట్టెమ్మ, ఎఇ ఆనంద్, నేతలు విశ్వనాథనాయుడు, జనార్ధనరెడ్డి, ఉదయ్‌కుమార్, మణి, కుమార్, రమేష్ పాల్గొన్నారు.

## కన్నుల పండువగా హరహరేశ్వరాలయ కుంబాభిషేకం



శ్రీకాళహస్తి,జనవరి 19 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయం సారథ్యంలో పనసకోనలో శిధిలమైన హర హరేశ్వరాలయం,అన్నపూర్ణేశ్వరి దేవి ఆలయాలకు శాస్త్రోక్తంగా, భక్తి శ్రద్దలతో ఆదివారం కుంబాభిషేకం నిర్వహించారు. పనస కోనలో పూర్వం రుషులు తపస్సులు చేసుకునే వారు. కాలక్రమేణ పాటుపడి శిధిలమై, దానిని జీర్ణోద్ధారణకు ఎన్నో సంవత్సరాల నుంచి అభ్యర్థనలే తప్ప ఆచరణకు నోచుకోలేదు. కాగా రూ.40లక్షలతో స్వామి అమ్మవార్లకు వేరు వేరు ఆలయాలు నిర్మించారు. మూడు రోజుల పాటు శాస్త్రోక్తంగా హోమాలు, కలశాల ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. వేద పండితుల వేద మంత్రా లతో, మంత్రాలతో పనస కోన దద్దరిల్లింది. ఆదివారం ఉదయం నుంచి కుంబాభిషేక కార్యక్రమాలను ఆలయ ఎఇఓ లోకేష్‌రెడ్డి పర్యవేక్షణలో సాగాయి. కుంబాభిషేకానికి రాజీవ్‌నగర్,కైలాసగిరి కాలనీ, రామచంద్రాపురం, కొత్తకండ్రిగ,శివనాథపురం తదితర గ్రామాల నుంచి భక్తులు హాజరయ్యారు. అలాగే విశ్వ హిందూ పరిషత్ పట్టణానికి చెందిన భక్తులు విశేష సంఖ్యలో హాజరయ్యారు.ఈ కార్యక్రమాల్లో ఉప ప్రధానార్చక దక్షిణామూర్తి,సుబ్రమణ్యం శర్మ తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఇఓ టి.బాపిరెడ్డి మాట్లాడుతూ రూ.25లక్షలతో కుమారస్వామి కొండ దిగువ భాగాన వినాయకునికి కొత్త మండపంను నిర్మించామని,బిక్షాల గాలిగోపురం పక్కన ఎంతో కాలంగా పూర్తి కాని రూ.1.25 కోట్లతో నిర్మించిన వాహనాల మండపం పనులు పూర్తి చేసామని వాటి కుంబాభిషేకం సోమవారం నిర్వహించనున్నట్లు వివరించారు.

## రూ.1.25కోట్లుతో వాహనాల మండపం

**-శివరాత్రికి లేజర్‌లైటింగ్ షోలు-పరిశీలించిన ఎంఎల్ఏ**





శ్రీకాళహస్తి, జనవరి 19 ప్రభాతవార్త : రూ.1.25కోట్లుతో వాహనాల మండపం, వినాయకుడు, చండికేశ్వరస్వాముల ఆలయాల కుంబాభిషేకానికి ఆదివారం రాత్రి అంకురార్పణ కార్యక్రమాలు నిర్వహించారు. నేడు ఉదయం కుంబాభిషేకం నిర్వహించనున్నారు. కాగా మహాశివరాత్రికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసే లేజర్ లైటింగ్‌షోను ప్రయోగాత్మకంగా పరిశీలించి బిక్షాలగోపురంపైన శివపార్వతులు నడుస్తు న్నట్లుగా చిత్రాలు కనువిందుల చేశాయి. ఈశివరాత్రికి భక్తులకు లేజర్ లైటింగ్ షో కనువిందు చేయనుంది. ఈఏర్పాట్లును ఆదివారం ఎంఎల్ఏ బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ రంగినేని చెంచయ్యానాయుడు, ఎఈఓ ఎస్ఆర్.కృష్ణారెడ్డి పలువురు నాయకులు,అధికారులు పేర్కొన్నారు.